ప్రభుత్వ కార్యాలయాల వద్ద గట్టి బందో బస్తు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేటలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ఏసీపీని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుడా కార్యాలయంలో జరిగిన ఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని ఏసీపీని కోరినట్లు తెలిపారు. ఆటోలో ఫైల్స్ తరలిస్తున్నారని సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఆటోను అడ్డుకున్నట్లు తెలిపారు. సుడా మాజీ ఛైర్మన్ రవీందర్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొమ్మల యాదగిరి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ, రాష్ట్ర మైనార్టీ సెల్ నేత కలిమ్ ముద్దీన్, వాహిద్ కన్, అజమత్, ఎర్రబోలు రాజిరెడ్డి, ఎర్ర మహేందర్, మహిపాల్ రెడ్డి, మెరుగు రాజు, జనార్దన్ రెడ్డి, హర్షద్, చిన్న, సాయి, ప్రతాప్, జునేదు, బొమ్మే ప్రవీణ్, మార్క పద్మ రాజు, అజ్మత్, పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన కలెక్టర్



నవ తెలంగాణ-నర్సాపూర్

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సామాన్య ప్రజలతో కలిసి ఆదివారం అందరిని ఆశ్చర్యపరిచేలా ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో మెదక్ నుంచి ఆర్టీసీ బస్సులో సామాన్య ప్రజలతో నర్సాపూర్ వరకు కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణం చేశారు. నర్సాపూర్‌లో బస్సు దిగి తన సొంత వాహనంలో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. కలెక్టర్ రాహుల్ రాజ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించడంతో అందరూ ఆశ్చర్యపోయారు.

ధరణితో.. అన్నదాత అవస్థలు

- జిల్లావ్యాప్తంగా 10,845 ధరణిలో దరఖాస్తులు
- అత్యధికంగా జగదేవ్‌పూర్ మండలంలో 904

నవతెలంగాణ-సిద్దిపేట

భూసమస్యల పరిష్కారానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి వెబ్సైట్‌ను తీసుకువచ్చింది. ప్రజలకు భూములపై ఇలాంటి సమస్యలు ఉన్న, భూ కొనుగోలు అమ్మకాలు వంటి విషయాలన్నింటినీ ధరణి వెబ్సైట్ ద్వారా అధికారులు పనులు చేస్తున్నారు. కాగా జిల్లావ్యాప్తంగా శనివారం నాటికి 10,845 ధరణిలో సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి కూడా కొన్ని తహసిల్దార్, ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్, కలెక్టర్ లాగిన్‌లలో పెండింగులో ఉన్నాయి. ఈ నెల 14న రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ ధరణి పెండింగ్ దరఖాస్తులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటికే జిల్లావ్యాప్తంగా సుమారు 13వేల ధరణి పెండింగ్ సమస్యలు ఉండగా, వారం రోజులలో అధికారులు మూడువేల సమస్యలను పరిష్కరించగా, 10,845 సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి.


అత్యధికంగా జగదేవ్‌పూర్ పరిధిలో సమస్యలు

జిల్లావ్యాప్తంగా అన్ని మండలాలలో ధరణి సమస్యలు ఉండగా, అత్యధికంగా జగదేవ్పూర్ మండలంలో 904 పెండింగ్ సమస్యలు ధరణి వెబ్సైట్లో ఉన్నాయి. అక్కన్నపేట మండలంలో 327, బెజ్జంకిలో 331, హుస్నాబాద్‌లో 328, కోహెడలో 601, మద్దూర్‌లో 125, దుల్మిటలో 113, గజ్వేల్ లో 888, కొండపాకలో 479, కుకునూరు పల్లిలో 385, మర్కుక్‌లో 500, ములుగులో 517, రాయపోల్‌లో 223, వర్గల్‌లో 414, అక్బర్ పేట భూంపల్లిలో 293, చేర్యాలలో 554, చిన్నకోడూరులో 506, దౌల్తాబాదులో 440, దుబ్బాకలో 579, కొమురవెల్లిలో 242, మిరుదొడ్డిలో 153, నంగునూరులో 213, నారాయణరావుపేటలో 317, సిద్దిపేట అర్బన్‌లో 835, సిద్దిపేట రూరల్ మండలంలో 429 పెండింగ్ సమస్యలు ఉన్నాయి.

అధికారుల వద్ద లాగిన్‌లో...

భూ సమస్యల పరిష్కారానికి అధికారుల వారీగా తహసిల్దార్ లాగిన్‌లో 4902, ముగ్గురు ఆర్డీఓల లాగిన్లలో 2482, అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ లాగిన్‌లో 1619, కలెక్టర్ లాగిన్‌లో 1842 సమస్యలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తుంది. రోజువారీగా సమస్యల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారులతో రివ్యూ జరుపుతూ ఉన్నారు. ఈ నెల చివరిగా 100 శాతం సమస్యలు పరిష్కరించాలనే లక్ష్యంతో అధికారులు ఉన్నట్లు తెలుస్తుంది. కానీ భూ సమస్యల పరిష్కారం పూర్తి కావాలంటే అంత ఈజీగా అయ్యే పని కాదని నెలలు నెలలు కాలం పడుతుందన్న విషయం అందరికీ విధితమే.









సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన భాషా పండితులు



నవతెలంగాణ-చేర్యాల

దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న 8630 మంది భాషాపండితులకు స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో భాషా పండితులు మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి గుల్లపల్లి తిరుమల కాంతి కృష్ణ మాట్లాడుతూ అడెక్వెసి బ్యాక్‌లాగ్ కారణంగా పదోన్నతులు రానటువంటి భాషాపండితులకు భవిష్యత్‌లో భాషాపండితులుగా నియామకమయ్యేవారు ఎవరూ లేనందున బ్యాక్ లాగ్ పోస్టులను సాధారణ పోస్టులుగా మార్చి పదోన్నతులు కల్పించాలని సీఎంను కోరినట్లు తెలిపారు. అప్ గ్రేడ్ కాకుండా మిగిలిపోయిన 1000 భాషాపండిత పోస్టులను స్కూల్ అసిస్టెంట్ భాషలుగా అప్ గ్రేడ్ చేసి పండిత వ్యవస్థను పూర్తిస్థాయిలో రద్దు చేయాలని, రంగారెడ్డి జిల్లాలోని ఉపాధ్యాయులకు కూడా పదోన్నతులు, బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శితోపాటు కోశాధికారి వి.ఎస్.ఎస్.సి.శర్మ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు హమీద్ ఖాన్ బృందం ఉన్నారు.

ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చారిత్రాత్మకం

నవతెలంగాణ-కొండాపూర్



ఏకకాలంలో రెండు లక్షల రైతు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని కొండాపూర్ మండలం కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ నరసింహులు అన్నారు. రైతుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం నరసింహులు మాట్లాడుతూ.. రెండు లక్షల రుణమాఫీతో రాష్ట్రంలో లక్షల మంది రైతులకు ఉపశమనం కలుగుతుందన్నారు. ఇచ్చిన ఆమీలను నెరవేర్చడానికి ఎంత ఇబ్బంది అయినా కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకాడబోదని.. రైతుల పక్షాన నిలుస్తుందన్నారు. రైతాంగం తరుపున ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కేసీఆర్, హరీశ్ రావుల అశీస్సులు తీసుకున్న మ్యాకల



నవతెలంగాణ-మర్కుక్

బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కుక్ మండలాధ్యక్షులు, ముదురాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మ్యాకల కనకయ్య మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుల ఆశీర్వాదం తీసుకున్నారు. పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని ఎర్రవల్లిలో గల వ్యవసాయక్షేత్రంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.

‘డిమాండ్స్ డే’ను జయప్రదం చేయాలి

కార్మిక సమస్యల పరిష్కారానికి జులై 10న డిమాండ్స్ డే..

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

నవతెలంగాణ-సంగారెడ్డి

కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా.. కార్మిక సమస్యల పరిష్కారానికి జులై 10న ‘డిమాండ్స్ డే’ను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్‌భవన్‌లో వరుణ్ బేవరేజెస్ కార్మికుల జనరల్ బాడీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రాగానే ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని, అంబానీ, కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే పనిని ముమ్మరం చేసిందన్నారు. ఇప్పటికే కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను, చట్టాలను కుదించి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా 4 లేబర్ కోడ్‌లను తెచ్చిందని.. వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు తమ హక్కుల కోసం పోరాడి సాధించుకున్న చరిత్ర ఉన్నదని.. ఇప్పుడు మళ్లీ అలాంటి పరిస్థితి వస్తుందన్నారు. కాబట్టి కార్మిక వర్గం ఐక్యంగా కార్మిక



హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి రాగానే వెనువెంటనే దేశంలోని 60 బొగ్గు గనులను కార్పొరేట్ శక్తులకు అప్పచెప్పేందుకే నిర్ణయించిందని అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని శ్రావణపల్లి బొగ్గు బావిని ప్రయివేటు చేసేందుకు వేలం వేస్తున్నదనానద్రు. వేలంపాటలో జరిగే కార్యక్రమానికి డిప్యూటీ ముఖ్యమంత్రి వెళ్లడం శోచనీయమన్నారు. లాభాలను గడుస్తూ, ఉపాధినిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం తన అన్యులైన కార్పొరేట్ శక్తులకు అప్పచెప్పేందుకు కంకణం కట్టుకున్నదన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మిక వర్గం, ప్రజల మీద ఉందన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులందరికీ నెలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించి, ఇతర ప్రయోజనాలు కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఉద్యోగులకు కార్మికులకు అయ్యర్ పెన్షన్ చెల్లించాలని, పెన్షన్ కుదించే చర్యను విడనాడాలని, కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దీకరణ చేయాలన్నారు. ఈపీఎస్ పెన్షన్ దారులకు కనీస పెన్షన్ 9000 తగ్గకుండా చెల్లించాలని, అంగన్వాడి, ఆశ, మధ్యన భోజనం తదితర స్కీముల్లో పనిచేసే వారిని కార్మికులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనాలు చెల్లించాలని, సామాజిక భద్రత ప్రయోజనాలు, పెన్షన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేర్లతో పని చేస్తున్న వారికి పర్మనెంట్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలన్నారు. ఈ డిమాండ్‌ల సాధనకు జులై 10న జరిగే దేశవ్యాప్త డిమాండ్స్ డేలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.మల్లేశం, జి. సాయిలు, నాయకులు బాలరాజ్, ప్రేమ్ కుమార్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీశైలం, చంద్రశేఖర్ రెడ్డి, నరేష్, భీమ్ రెడ్డి, శివకుమార్, యాదయ్య, రవీందర్ రెడ్డి, షఫీ, కిరణ్, సత్యనారాయణ, సురేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బుదేరా రోడ్డుపై దుర్గంధం

కెమికల్‌ను రోడ్డుపై పారబోసిన గుర్తుతెలియని వ్యక్తులు

దుర్వాసతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

నవతెలంగాణ-మునిపల్లి



మండల కేంద్రమైన మునిపల్లి చౌరస్తా నుంచి బుదేరా చౌరస్తా వరకు ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డుపై కెమికల్‌ను పారబోసి వెళ్లిపోయారు. ఆ దుర్వాసనతో గత నాలుగు రోజులుగా ఈ రోడ్డు గుండా వెళ్లే ప్రయా ణికులు ఇబ్బం దు లు పడుతున్నారు. ఈ కెమికల్ ధాటికి రోడ్డు పక్కన ఉన్న గడ్డి కూడా కాలిపోవడం గమనార్హం. చినుకు పడితే ఆ దుర్వాసన మరింత ఎక్కువై.. ప్రయాణీకులు, వాహన దారులు నానా అవస్థలు పడుతున్నారు. ఆ వాసనతో నెత్తి నొప్పి, కళ్ళు మండడం జరుగుతుందని వాపోతున్నారు. ఈ దుర్వాసన ఊపిరితిత్తులపై ప్రభావం పడి శ్వాసకు సంబం ధించిన అనే క రోగాలు వచ్చే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్య క్తం చేస్తున్నారు. అసలు ఈ కెమికల్ ఎవరు పారబోశారు.. ఎందుకు పారబోశారో సంబంధిత శాఖ అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పంటలు కూడా దెబ్బతింటాయి



ఈ దుర్వాసనతో ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. పంటలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి



ప్రయాణం చేసేటప్పుడు కెమికల్ మీద ఉన్న దుమ్ము కండ్లల్లో పడితే కంటి సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఊపిరితిత్తుల వ్యాధి వచ్చే అవకాశం ఉంది. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– విజయ్, మాజీ ఉపసర్పంచ్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సంగారెడ్డి
సోమవారం | 24 జూన్ 2024 | www.navatelangana.com

ప్రతీ హామీని నెరవేర్చుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం



నవతెలంగాణ-కొండాపూర్

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చుతూ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నదని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుదాస్ అన్నారు. ఏకకాలంలో రెండు లక్షల రైతు రుణమాఫీ చేయాలని ఇటీవలే ప్రభుత్వం చేసిన నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 2018 డిసెంబర్ నుంచి 2023 డిసెంబర్ వరకు ఈ ఐదేండ్ల వరకు కట్ఆఫ్ నిర్ణయించి ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయడానికి నిర్ణయం చేసిందన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో రూ.28వేల కోట్ల రైతు రుణమాఫీ చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం అతి తక్కువ కాలంలోనే రూ.31వేల కోట్ల రైతు రుణమాఫీకి చర్యలు తీసుకున్నదన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మాజీ మంత్రి హరీశ్‌రావు తన సవాల్ ప్రకారం రాజీనామాకు సిద్ధంగా ఉండాలని హితవు పలికారు.

కార్మికుల సంక్షేమానికి కృషి



నవతెలంగాణ-రామచంద్రాపురం

కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నామని, కార్మికులు యాజమాన్యం మధ్య ఆరోగ్యకరమైన సంబంధాలు ఉన్నప్పుడు పరిశ్రమ అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పెన్నార్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ పరిశ్రమ యాజమాన్యం ప్రతీయేడు బీహెచ్ఎల్ పరిశ్రమ టౌన్షిప్లో నిర్వహించే చౌడమ్మ దేవి పూజా కార్యక్రమంలో భాగంగా.. ఆదివారం నిర్వహించిన పూజా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా పరిశ్రమ యాజమాన్యం, కార్మికులతో కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ టీయూ అధ్యక్షులు రాంబాబు, పరిశ్రమ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, పరిశ్ర మ డైరెక్టర్ లావణ్య కుమార్, మానవ వనరుల విభాగం అధిపతి సత్యనారాయణ, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.



300 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం

నవతెలంగాణ-మునిపల్లి

అక్రమంగా తరలిస్తున్న 300 గ్రాముల ఎండు గంజాయిని కంకోల్ టోల్ ప్లాజా వద్ద ఎక్సైజ్, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఆదివారం రోజున పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి జి.శ్రీనివాస్ రెడ్డి అసిస్టెంట్ కమిషనర్ ప్రొహిబిషనస్, ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ మెదక్ డివిజన్ సంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా ఎండు గంజాయి రవాణా చేపడుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు కె.శ్రీనివాసరావు అసిస్టెంట్ సూపరిండెంట్ ఎన్ఫోర్స్మెంట్ మెదక్ డివిజన్ ఆధ్వర్యంలో జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లే రహదారిలో కంకోల్ టోల్గేట్ ప్లాజా దగ్గర ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో జహీరాబాద్ పట్టణానికి చెందిన ఎండీ మొహిజ్ కంకోల్ టోల్ గేట్ దగ్గర టీఎస్07ఎఫ్ఎల్5223 అనే నెంబర్ గల తన ద్విచక్ర వాహనం పై ఎండు గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డాడు. అతని వద్ద 300 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైనట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్ఫోర్స్మెంట్ సీఐ సిహెచ్ చంద్రశేఖర్, ఎస్సై యాదయ్య, హెడ్ కానిస్టేబుల్ ఎండి అలీమ్, అజం హుస్సేన్, కానిస్టేబుల్స్ సతీష్ రామారావు, గోపాల్ పాల్గొన్నారు.



భావి తరాలకు పచ్చదనం బహుమతిగా అందిద్దాం

నవతెలంగాణ-పటాన్‌చెరు

మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని.. భావితరాలకు పచ్చదనాన్ని బహుమతిగా అందిద్దామని పటాన్‌చెరు మాజీ జడ్పీటీసీ, లయన్స్ క్లబ్ (ఎంజేఎఫ్) మాదిరి జైపాల్ ముదిరాజ్ అన్నారు. ఎండీఆర్ ఫౌండేషన్ కో ఫౌండర్ మాదిరి ప్రిథ్వీరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని అంబేద్కర్ కాలనీ, న్యూ మార్కెట్ రోడ్డులో మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని, భావి తరాలకు పచ్చదనాన్ని బహుమతిగా అందించాలని వారు పిలుపునిచ్చారు. అడవుల నరికివేత, రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యం వల్ల భూతాపం పెరిగిపోతోందన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భూమి మీద జీవరాశి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని వివరించారు. అందుకే ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాదిరి దేవేందర్ రాజు, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, సపనదేవ్, ప్రతాప్, ప్రకాష్ రావు, సాయితేజ, వెంకటేశ్వర్లు, మతీన్, నరేష్, రాజన్ సింగ్, ఎండీఆర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ మధు, ఫౌండేషన్, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



శ్యాం ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళ్లు

నవతెలంగాణ-సంగారెడ్డి

బీజేపీ సంగారెడ్డి పట్టణాధ్యక్షులు ద్వారక రవి ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ రాజు గౌడ్, కౌన్సిలర్ మందుల నాగరాజు, జిల్లా కార్యాలయ కార్యదర్శి దోమల విజయకుమార్, జిల్లా సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మీనా గౌడ్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు నరేన్ దేశ్పాండే, వినోద్, యశ్వంత్, బిక్షపతి, తేజస్విని, లక్ష్మి, సంతోషి, కవిత, లింగమూర్తి, సందీప్, అజయ్, సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.



జోగిపేట : గొప్ప జాతీయవాది, విద్యావేత్త డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 194వ వర్ధంతి సందర్భంగా జోగిపేటలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి బీజేపీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షులు గోపన్‌పల్లి శివశంకర్, ఉపాధ్యక్షులు రాజు, కిసాన్ మోర్చా అధ్యక్షులు వెంకటేశం, బూత్ అధ్య క్షులు అనిల్ కుమార్, బీజేపీ నాయకులు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



గుమ్మడిదల : శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని గుమ్మడిదల మండల కేంద్రంలో గల బీజేపీ కార్యాలయంలో ఆదివారం ముఖర్జీ చిత్రపటానికి మండలాధ్యక్షుడు పలుగు గోవర్ధన్ రెడ్డి.. నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు గిద్దె రాజు, జిల్లా ఓబీసీ కార్యదర్శి చెన్నంశెట్టి ఉదయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బుచ్చగారి రాంరెడ్డి, చింతల యాదగిరి, శ్యామల అంజిరెడ్డి పోచుగారి రవీందర్ రెడ్డి, భాజ భాస్కర్ గౌడ్, లక్ష్మీనారాయణ, కుమార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నిమ్జ్.. నిర్లక్ష్యం

- పరిహారం కోసం ఎండ్లుగా ఎదురుచూపులు
- రికార్డు, పొజిషన్‌కు ఐదెకరాలు ఉన్నా.. నాలుగు ఎకరాలకే పరిహారం
- రైతుల ఖాతా నుంచి టీఎస్ఐఐసికి భూములు మొత్తం బదలాయింపు
- న్యాయం చేయాలని కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- అధికారుల తీరుపై ఆందోళన

నిమ్జ్..నిమ్జ్... సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో ఇప్పుడు వినిపించే ఊతపదం ఇది. ఈ ప్రాజెక్టు పేరుతో జహీరాబాద్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు లభించి ంది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. కానీ ప్రజా ప్రయోజనాల కోసం భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటికీ పూర్తి న్యాయం జరగడం లేదు. ఇంకా చేదు అనుభవాలే వారికి మిగిలాయి.



నవతెలంగాణ-ఝరాసంగం

ప్రాజెక్టు ఏర్పాటుకు 2013లో 12,635 ఎకరాల్లో భూసేకరణ చేపట్టేందుకు అప్పటి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకుగాను ఝరాసంగం మండలంలోని ఎల్గోయి, బర్దిపూర్, చిలేపల్లి, చిలేపల్లి తాండ, రుక్మాపూర్, రుక్మాపూర్‌తండా, ముంగి, ముంగి తాండాల్లో మొదటి విడతగా 2018లో 3500 ఎకరాలను సేకరించింది. ఈ సేకరించిన భూమిలో దాదాపు 90 శాతం మంది అసైన్మెంట్ భూములు కోల్పోయిన రైతులే ఉన్నారు. అప్పటి భూసేకరణలో పాల్గొన్న టీం అధికారుల తప్పిదాల వల్ల రైతులు నేటికీ ఇంకా ఇబ్బందులు పడుతూ తహసీల్దార్, నిమ్జ్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

ప్రాజెక్టు భూసేకరణ లక్ష్యం..

ప్రాజెక్టు కింద 17 గ్రామాలు ఎంపిక కాగా మొదటి విడతగా 5 గ్రామాలు ఎంచుకున్నారు. ఝరాసంగం మండలంలో బర్దిపూర్, ఎల్గోయి, చిలేపల్లి, న్యాల్కల్ మండలంలో రుక్మాపూర్, ముంగి గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో పట్టా, అసైన్మెంట్ భూమి కలిపి 4462 ఎకరాలు సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఇప్పటివరకు 3596 ఎకరాల భూమిని అధికారులు సేకరించారు. ఇంకా 866 ఎకరాలు పై గ్రామాలలో సేకరించాల్సి ఉంది. ఒకవేళ ఈ మిగిలిన భూమిని ప్రభుత్వం సేకరిస్తే ఇక ఆ గ్రామాలు పూర్తిగా భూమిని కోల్పోయి జీవనాధారం కోల్పోయే పరిస్థితిలు నెలకొననున్నాయి. ఇప్పటివరకు 17 గ్రామాల్లో 5796 ఎకరాలు రెండు విడతల్లో కలిపి భూసేకరణ చేపట్టారు. అయితే ఇందులో దాదాపు 3500 ఎకరాల అసైన్మెంట్ భూమి ఉన్నది. ఇక మిగిలిన 12 గ్రామాల్లో ఇంకా 5972 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. మొదటి విడతలో సేకరించిన భూమిలోనే అధిక సమస్యలు ఇమిడి ఉన్నాయని తెలుస్తోంది. అధికారులు మొదటి విడతలో సేకరించిన భూముల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాకే రెండో విడతలో భూములు సేకరించాలని రైతులు కోరుతున్నారు.

పరిహారం.. ఫలహారం

మొదటి విడత భూసేకరణలో భాగంగా రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు మూడు కేటగిరీలుగా విభజించారు. అందులో అసైన్మెంట్ భూములకు సంబంధించి సాగులో లేని ఎకరా భూమికి రూ.3.25 లక్షలు, సాగు చేసిన భూమికి రూ.4 లక్షలు, ఇక పట్టా భూమికి ఎకరాకు రూ.5.65 లక్షలు చెల్లించారు. కాస్తుకు, రికార్డుకు రైతులు ఉన్నప్పటికీ వారికి పూర్తి పరిహారం చెల్లించకుండా అధికారులు ఇష్టానుసారంగా భూమిని సేకరించారు. ఉదాహరణకు.. ఒక రైతుకు 5 ఎకరాల అసైన్మెంట్ భూమి ఉంటే అలాంటివారికి 4 ఎకరాలు, 3 ఎకరాలు ఉంటే 2 ఎకరాల వరకే పరిహారం చెల్లించారు. మిగిలిన 1 ఎకరానికి పరిహారం చెల్లించకుండానే రైతు ఖాతా నుంచి మొత్తం భూమిని టీఎస్ఐఐసి పేరు మీదుగా ఆన్‌లైన్‌లో పూర్తిగా బదలాయించారు. ఇలాంటి రైతులు ఎల్గోయి గ్రామంలోనే అత్యధికంగా ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. అప్పటి అధికారుల తప్పిదాలవల్ల రైతులు నేటికీ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. మొన్నటివరకు ఎన్నికల హడావిడి ఉండడంతో అధికారులంతా ఎన్నికల విధుల్లోనే బిజీ బిజీగా ఉండడంతో రైతుల సమస్యలకు పరిష్కారం లభించలేదు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగియడంతో ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించకుండా పోతాయా అని నిర్వాసితుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

కోర్టును ఆశ్రయించిన నిర్వాసితులు..

ప్రాజెక్టు కింద మొదటి విడతలో అసైన్మెంట్ భూమిని కోల్పోయిన కొందరు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. నష్టపరిహారం చెల్లింపు విషయంలో తమకు అన్యాయం జరిగిందని పట్టా రైతులకు చెల్లించిన విధంగా తమకు కూడా పరిహారం చెల్లించాలని రైతులు ప్రధాన డిమాండ్‌గా 2018లో కోర్టులో కేసు వేశారు. ఈనెల 6న రైతులకు పట్టాతో సమానంగా పరిహారం చెల్లించాలని మిగిలిన మొత్తాన్ని ఎనిమిది వారాల్లో ప్రక్రియ పూర్తి చేయాలని కోర్టు ఆదేశించింది. దాంతో మిగిలిన (కేసులు వేయని) భూ నిర్వాసితుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కేసులు వేయనటువంటి రైతులకు కూడా ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందా.. లేదా అనేది ప్రశ్నార్థకమే. ఏది ఏమైనా రైతుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

చెక్కులు ఇవ్వడంలో ఇబ్బంది పెడుతున్న అధికారులు

మరోపక్క వచ్చిన హరిహారం చెక్కులను ఇవ్వడంలోనూ అధికారులు ఇబ్బంది పెడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. జీవనాధారం కోల్పోయిన తమ వద్ద నుంచి లంచాలు అడుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే న్యాల్కల్ ఆర్ఐ నిమ్జ్ భూ నిర్వాసిత రైతు వద్ద లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడడమే ఇందుకు నిదర్శమన్నారు. భూములు కోల్పో యిన తమకు పూర్తి పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలి



నిమ్జ్ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి. చీలపల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 112, 113,151లో సుమారు 20 మంది రైతులకు నష్టపరి హారం చెల్లించలేదు. రైతులు వారి భూముల్లో పంటలు సాగు చేసుకుంటే పంటలు సాగు చేయకూడదని అధికారు లు చెప్పడం సరికాదు. భూముల నష్టపరిహారం కోసం పలు మార్లు నిమ్జ్ కార్యాలయానికి వెళ్ళినా ఎలాంటి స్పందన రాలేదు. నష్టపరిహారం ఇచ్చేంత వరకు సాగు చేసిన పంటలను తొలిగించే ప్రసక్తే లేదు. భూములు లేని రైతులకు అప్పటి అధికారులు నష్టపరిహారం చెల్లించారు. నిమ్జ్ కార్యాలయంలో ఓ రిటైర్డ్ అధికారి తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

– మైబూబ్ పాటిల్, చీలేపల్లి మాజీ సర్పంచ్

ఎకరా భూమికి పరిహారం ఇవ్వలేదు

గ్రామ శివారులోని సర్వేనెంబర్ 125/6లో నాకు ఐదు ఎకరాల అసైన్మెంట్ భూమి ఉంది. నిమ్జ్ ప్రాజెక్టు కోసం భూమిని తీసుకున్నారు. ఐదు ఎకరాలు ఉంటే నాలుగు ఎకరాలకు మాత్రమే చెక్కు అందజేశారు. ఈ డబ్బులు తీసుకోకుంటే.. కోర్టులో జమ చేస్తాం మీ ఇష్టం మరి అని అప్పటి టీం అధికారులు భయభ్రాంతులకు గురి చేసింద్రు. నా పాస్ పుస్తకం నుంచి పూర్తిగా 5 ఎకరాలను టీఎస్ఐఐసీ కింద మార్చేశారు. ప్రభుత్వం ఒక ఎకరానికి పరిహారం చెల్లించి న్యాయం చేయాలి.

– కిష్టయ్య, ఎల్గోయి గ్రామం

వడ్ల డబ్బుల్లో కోతలు

- మూడు నుంచి ఐదు కిలోల వరకు తరుగు పెట్టిన రైస్‌మిల్లులు
- డబ్బులు తక్కువగా రావడంతో గుర్తించిన రైతులు
- పీఏసీఎస్ కార్యాలయం ముట్టడి.. రోడ్డుపై బైఠాయింపు
- తరుగు పెట్టిన ధాన్యానికి డబ్బులు చెల్లిస్తామన్న హామీతో విరమణ

నవతెలంగాణ-వట్‌పల్లి

రైస్ మిల్లర్లు ఇష్టారీతిన మూడు నుంచి ఐదు కిలోల వరకు ధాన్యంలో తరుగు పెట్టడం పట్ల అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం పీఏసీఎస్ సెంటర్‌తో పాటు.. రైస్ మిల్లులను ముట్టడించారు. ధాన్యం డబ్బులు తక్కువగా జమ కావడంతో అనుమానం వచ్చిన రైతులు ఒకరికొకరు విషయం పంచుకోగా.. రైస్ మిల్లర్లు చేసిన దోపిడీ బయటపడింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే..

మండలంలోని బిజిలిపూర్, పేరూరు గ్రామాల్లో ఇందిరాక్రాంతి, ఖాదరాబాద్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంగం ఆధ్వర్యంలో గత సీజన్‌లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కోనుగోలు చేశారు. సెంటర్ ముగిసే వరకు 20600 బ్యాగులను 12 లారీల్లో బిజిలీపూర్ నుంచి, కేరూర్ నుంచి మరో ఆరు లారీలను ఒక్కొక్క లారీకి 550 నుంచి 600 బ్యాగుల వరకు జోగిపేట శివారులోని కన్యక పరమేశ్వరి రైస్ మిల్‌కు తరలించారు. అయితే ప్రభుత్వం క్వింటాకు రూ.2203 మద్దతు ధరతో ధాన్యాన్ని కొనుగోలు చేసింది. అయితే కొనుగోలు కేంద్రాల నుంచి బస్తాలు మిల్లులకు వెళ్లిన తర్వాత.. తరుగు పేరుతో మిల్లుల యాజమాన్యం మూడు నుంచి ఐదు కిలోల వరకు కట్ చేసింది. కాగా ఓ రైతుకు 34 క్వింటాళ్ల 40 కిలోలు ధాన్యం కాగా రూ.75,783 రావాల్సి ఉండగా రూ.68,733 మాత్రమే జమ అయ్యాయి. అనుమానం వచ్చిన అతడు మిగతా రైతులను సంప్రదించగా.. వారికి కూడా డబ్బులు తక్కువగా పడ్డట్లు తెలిసింది. దాంతో రైతులను ఎలా మోసం చేస్తారని ఖాదీరాబాద్‌లోని పీఏసీఎస్ కార్యాలయాన్ని పలువురు రైతులు ఆదివారం ముట్టడించారు. పీఏసీఎస్ కార్యదర్శి శ్రీకాంత్, చైర్మెన్ వినోద్ గౌడ్‌ను నిలదీశారు. కిలో తరుగు తీస్తామని చెప్పి మూడు కిలోల నుండి 5 కిలోల వరకు ఎలా తీశారని మండిపడ్డారు. దాంతో వారు చేసేదేమీ లేక.. రైతులతో కలిసి జోగిపేట డాకూరు శివారు పరిధిలోని కన్యక పరమేశ్వరి రైస్ మిల్లు వెళ్లారు. మిల్ యజమాన్ని రైతులు నిలదీయగా.. తరుగు పేరుట మూడు కిలోలను తీసినట్టు ఒప్పుకున్నారు. దాంతో తమకు జరిగిన నష్టాన్ని ఎవరు భరిస్తారని రైతులు నిలదీస్తూ.. రోడ్డుపై బైటాయించారు. చివరికి కన్యకా పరమేశ్వరి రైస్‌మిల్, పీఏసీఎస్ కార్యదర్శి శ్రీకాంత్‌లు రైతులతో మాట్లాడి.. తరుగు పేరిట కట్ చేసిన రెండు కిలోలకు డబ్బులు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. కాగాఒక్క ఖాదీరాబాద్ సెంటర్‌లోనే ఇంత అన్యాయం జరిగిందని.. మిగిలిన బిజిలిపూర్, కేరూర్‌లో ఇంకెంత జరిగిందో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే జొన్న కొనుగోలులోనూ కోతలు జరిగాయని వాటిపై కూడా విచారణ జరిపించాలన్నారు.



కారు పక్కకు తీయాలన్నందుకు దాడి..

నవతెలంగాణ-మునిపల్లి



రోడ్డుపై అడ్డంగా ఉన్న కారును పక్కకు తీయాలన్నందుకు ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన ఘటన కంకోల్ టోల్‌ప్లాజా వద్ద ఆదివారం జరిగింది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కంకోల్ గ్రామానికి చెందిన పట్లోళ్ల విజయ్ తన స్నేహితుడైన భాస్కర్ రెడ్డితో కలిసి సంగారెడ్డి నుంచి స్వగ్రామైన కంకోల్‌కు వస్తున్నాడు. కంకోల్ టోల్ ప్లాజా వద్దకు రాగానే గుర్తుతెలియని వ్యక్తులు అక్కడ సెల్ఫీ దిగుతున్నారు. దాంతో రోడ్డుపై సెల్ఫీలు ఏంటి.. అడ్డంగా ఉన్న కారును పక్కకు తీయండి అని వారిక చెప్పారు. దాంతో మాటా మాట పెరిగి గొడవకు దారి తీసింది. ఈ క్రమంలో కారులో ఉన్న రాడ్డును తీసి విజయ్ పై దాడి చేశారు. గొడవ మరింత ఉద్రిక్త కావడంతో.. కారులో నుంచి తల్వార్ (కత్తి) తీసి విజయ్‌పై దాడి చేయగా.. ఆయన తల, చెవి, చెంపపై తీవ్ర గాయాలయహయ్యాయి. స్థానికులు బాధితుడిని హుటా హుటిన సదాశివపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా దాడి చేసిన నిందితులు పరారీలో ఉండడంతో వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. విజయ్ తండ్రి పట్లోళ్ల నాగిశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతుల కళ్లలో ఆనందమే చూడడమే సీఎం లక్ష్యం



నవతెలంగాణ-జిన్నారం

తెలంగాణ రాష్ట్ర రైతాంగం కళ్ళల్లో ఆనందం చూడాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి లక్ష్యమని మెదక్ పార్లమెంటరీ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఏకకాలంలో రెండు లక్షల రైతు రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం నిర్ణయించడం పట్ల హర్షిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ చిత్రపటాలకు జిన్నారం ఎంపీపీ దమ్మగౌని రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షులు గంగు రమేష్ జిన్నారం మండల బ్లాక్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు వడ్డె కృష్ణ, దాసరి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ.. ప్రజలకు మాటిస్తే నెరవేర్చడం కాంగ్రెస్ పార్టీ ప్రథమ కర్తవ్యవన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. రుణమాఫీ తో పాటుగా రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడం, మెరుగైన మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం ఇలాంటి ప్రత్యేక కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, రాష్ట్ర క్యాబినెట్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి,వావిలాల పిఎసిఎస్ మాజీ చైర్మన్ ఎంపీ మాణిక్యరావు, పల్నాటి భాస్కర్, ప్రతాప్ రెడ్డి, నారాబోయిన శ్రీనివాస్,సుంకరబోయిన మహేష్, మల్లేష్, రమేష్ ,సత్యా నారాయణ, వెంకటేష్, శ్రీశైలం, అశోక్, శేఖర్, నీలం శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సర్వ మతాల సారం ఒక్కటే..

నవతెలంగాణ-జహీరాబాద్

సర్వ మతాల సారం ఒక్కటే అని.. ఏ మతంలో కూడా ఎవరిని కించపరిచే విధంగా రాసి లేదని, ప్రతి ఒక్కరూ తమ తమ మతాలను గౌరవించుకుంటూ పరాయి మతాన్ని కూడా గౌరవించాలన్నదే సర్వమత సారమని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. జహీరాబాద్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన శ్రీ శ్రీ రాధా గోవింద రథ యాత్రలో పాల్గొని.. పూజ కార్యక్రమం నిర్వహించి, రథ యాత్రను ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం గతంలో అక్షయపాత్రకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చి.. వారు సరఫరా చేస్తున్న నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించేందుకు కృషి చేసిందన్నారు. స్వర్ణ దేవాలయం, బంజారా హిల్స్ హైదరాబాద్‌లో కొలువైన రాధా గోవింద ప్రతిమలను రథంలో ఊరేగిస్తూ హరే కృష్ణ హరేరామ జపాన్ని జపిస్తూ, కృష్ణ కీర్తనలు ఆలపిస్తూ వాటికి అనుగుణంగా భక్తులు నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో సత్య గౌరంగ చంద్ర దాస్ ప్రభు, విభీషణ దాస్ ప్రభు, యజ్ఞేశ్వర్ ప్రభు లతో పాటు స్థానిక నగర సంకీర్తన సభ్యులు, వివిధ పార్టీల నాయకులు వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు అల్లాడి వీరేశం గుప్తా, సాయి రెడ్డి విట్టల్‌రెడ్డి, భాస్కర్ యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, మున్సిపల్ చైర్మన్ అల్లాడి నర్సింలు, మాజీ ఆత్మ చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల సంక్షేమమే సీఐటీయూ లక్ష్యం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు
- సీఐటీయూ చేరిన ఐఎన్‌టీయూసీ, టీఎంఎస్ యూనియన్ కార్మికులు

నవతెలంగాణ-జహీరాబాద్


కార్మికుల సంక్షేమమే సీఐటీయూ లక్ష్యం అని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. మహేంద్ర అండ్‌మహేంద్ర పరిశ్రమలో ఐఎన్‌టీయూసీ, టీఎంఎస్ యూనియన్ కార్యకర్తలు ఆదివారం సీఐటీయూ యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి యూనియన్ జెండాలు కప్పి చుక్క రాములు సాదరంగా సీఐటీయూలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, మెరుగైన వేతన ఒప్పందాల, చరిత్ర తిరిగి రాసేందుకు మరోసారి మహేంద్ర అండ్ మహేంద్రలో సీఐటీయూ ఎర్రజెండా ఎగరేయాలన్నారు. మంచి వేతన ఒప్పందం, సౌకర్యాలు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుతూ.. మరోవైపు యాజమాన్యంతో పోరాడి హక్కులను సాధించడం జరుగుతున్నదన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండాలని, ఐక్యతతోనే మరిన్ని విజయాలు సాధించొచ్చు అన్నారు.ఈ సందర్భంగా సీఐటీయూలో చేరిన వారు మాట్లాడుతూ.. మహీంద్రాలో మెరుగైన వేతన ఒప్పందం, కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత ఎర్రజెండా, కామ్రేడ్ చుక్క రాములుతోనే సాధ్యమని భావించి నమ్మకంతో సీఐటీయూలో చేరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.రాజిరెడ్డి, క్లస్టర్ కన్వీనర్ ఎస్.మహిపాల్, ఆఫీస్ బేరర్స్ పాల్గొన్నారు.



విద్యుద్ఘాతంతో మేకలు మృత్యువాత

నవతెలంగాణ-న్యాల్‌కల్

ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ వైర్ తగిలి విద్యుద్ఘాతంతో రెండు మేకలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మండలంలోని గంగ్వార్ గ్రామ శివారులో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన పశుపోషకుడు మానెప్పకు చెందిన రెండు మేకలు.. ఆదివారం రోజున గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరికి వెళ్లగా.. ఎర్తింగ్ వైరు తగిలి విద్యుద్ఘాతంతో మృత్యువాత పడ్డాయకి. వాటి విలువ రూ.15వేలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. సంబంధిత అధికారులు స్పందించి నష్టపరిహారం ఇవ్వాలని కోరాడు.



రైతు రుణమాఫీపై హర్షం..

నవతెలంగాణ-కోహిర్

రాష్ట్ర ప్రభుత్వం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామనడం పట్ల కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల నాయకుడు వినోద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జాతీయ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చెప్పిన విధంగా రాష్ట్రంలో రైతులకు 2 లక్షల రుణమాఫీ చేయడం పట్ల వారికి కృతజ్ఞతలు తెలిపారు



3
నవతెలంగాణ
మెదక్
సోమవారం | 24 జూన్ 2024 | www.navatelangana.com

12వ వార్డులో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-తూప్రాన్

12వ వార్డులో నూతన సీసీ రోడ్డుకు మరమ్మత్తులు తూప్రాన్ మున్సిపల్ పరిధిలో 12వ వార్డులోని మహంకాలి వీధిలో నూతనంగా సీసీ రోడ్డు వేయించడం కోసం రోడ్డుకి ఇరువైపుల ఉన్న అరుగులను తొలగించి, చదును చేయడం జరిగింది. ఈ పనులను మునిసిపల్ చైర్మన్ మామిండ్ల జ్యోతి కృష్ణ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాగులు, సత్యనారాయణ, మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని సలాక్ పూర్ జడ్పీఎస్ఎస్ పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు. ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను. శాలువా మెమొంటలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ తీపి జ్ఞాపకాలను ఒకరు ఒకరు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

24న గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నా

- కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలి
- సీఐటీయూ జిల్లా కమిటీ పిలుపు

నవతెలంగాణ-మెదక్ టౌన్

జూన్ 24వ తేదీన మెదక్ కలెక్టరేట్ ఎదుట జరిగే గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ మెదక్ జిల్లా కమిటీ కార్మికులకు పిలుపునిచ్చింది. గ్రామ పంచాయతీ కార్మికులకు 8 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకుండా పంచాయతీ కార్మికులతో వెట్టి చాకిరికి వ్యతిరేకంగా మెదక్ కలెక్టర్ కార్యాలయాలయం ఎదుట ధర్నా నిర్వహించాలని గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ రాష్ట్ర కమిటి పిలుపునిచ్చింది కావున పిలుపులో భాగంగా మెదక్ జిల్లాలో ఉన్న అన్ని మండలాల పరిధిలోని గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు.

గంజాయి అమ్ముతున్న యువకుడి అరెస్ట్

- 310 గ్రాముల గంజాయి స్వాధీనం

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

గంజాయి తాగడంతోపాటు ఇతరులకు అమ్ముతున్న యువకుడిని పట్టుకొని 310 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని, అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట టూ టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల గ్రామానికి చెందిన గడ్డం చరణ్ కుమార్ గంజాయి తాగడంతో పాటు ఇతరులకు అమ్ముతున్నాడన్న సమాచారం మేరకు సిద్దిపేట పట్టణంలోని కేసీఆర్ నగర్‌లో గంజాయి అమ్మడానికి సిద్ధంగా ఉన్న అతన్ని పట్టుకొని తనిఖీ చేయగా, 310 గ్రాముల గంజాయి దొరికినట్లు తెలిపారు. నిందితుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పేదింటి వధువు వివాహానికి జెడ్పీటీసీ ఆర్థిక సాయం

నవతెలంగాణ-నర్సాపూర్

శివంపేట మండల పరిధిలోని దొంతి గ్రామానికి చెందిన సాజిదా కూతురు వివాహానికి ఆదివారం శివంపేట జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా తన వంతు సహాయంగా పదివేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో శివంపేట మండల బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు పిట్ల సత్యనారాయణ. గ్రామ కమిటీ అధ్యక్షులు చాకలి సత్యనారాయణ, గ్రామస్తులు శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి, కుమ్మరి కృష్ణ, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి సహకరించాలి



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండలం నాగపురి గ్రామ శివారులో ఉన్న శ్రీ నల్ల పోచమ్మ దేవాలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని దేవాలయ కమిటీ చైర్మన్ గూడెం మహేష్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో మహేష్ మాట్లాడుతూ దేవాలయ భూమిని అక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి విన్నవించిన వెంటనే చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో దేవాలయ కమిటీ సభ్యులు ఆరుట్ల వినీత్, వెంకట స్వామి, విజయలక్ష్మి, వీరేశం తోపాటు మాజీ సర్పంచ్ చిరుమల నర్సింహులు, గొట్టం జలందర్ రెడ్డి, కేతోజు వెంకటేశం, నర్సింహులు, ఎలేశం, నారాయణ, ఉప్పలయ్య, గ్రామ యూత్ సభ్యులు ఎల్లం, శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరకవి సిద్ధప్ప జయంతి వేడుకలు



నవతెలంగాణ-సిద్దిపేట

జూలై 7న నిర్వహించే శ్రీశ్రీశ్రీ వరకవి సిద్ధప్ప జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిద్దామని శాలివాహన చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఇటికాల వీరయ్య ప్రజాపతి కోరారు. ఆదివారం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఏ. లక్ష్మీరాజం ప్రజాపతితో కలసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరకవి సిద్ధప్ప మన సిద్దిపేట జిల్లా ప్రాంతానికి చెందినవారు కావడం మనకెంతో గర్వకారణం అని, హైదరాబాదులో నిర్వహించబోయే కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ పీసీసీ మెంబర్ దరిపల్లి చంద్రం ఆధ్వర్యంలో వరకవి సిద్ధప్ప జన్మస్థలం కోహెడ మండలంలోని గుండారెడ్డిపల్లికి వెళ్లి, వరకవి సిద్ధప్ప విగ్రహానికి పూలమాలవేసి, నివాళు లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులడు మాణిక్యంని పూర్వ చరిత్రకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వరకవి సిద్ధప్ప విగ్రహ కమిటీ మెంబర్స్ రాజలింగం, డాక్టర్ రామచంద్రము, రాదారి నాగరాజు, దరిపల్లి నగేష్, దుర్గయ్య , రాములు, రాజు, విలసాగరం తిరుపతి, పర్శరరములు తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



నవతెలంగాణ-పాపన్నపేట

రాష్ట్ర ప్రభుత్వం ఏలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని పాపన్నపేట మండలం సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు కుమ్మరి జగన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు, గతంలో రాజశేఖర్ రెడ్డి, కేసిఆర్ కాలంలో ఏలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు, ఇప్పుడు అలాగే చేయాలన్నారు. తెల్లరేషన్ కార్డు నిబంధన పెడతారంటూ లీకులు వస్తున్నాయని, అలా పెడితే అర్హులైన రైతులు చాలామంది నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. బేషరతుగా గత ప్రభుత్వాల మాదిరిగా రుణమాఫీ చేయాలన్నారు. అంతేకాకుండా కెసిఆర్ కాలంలో మే నెలలోనే రైతులకు రైతుబంధు నిధులు విడుదల చేసే వారిని దీంతో రైతులు వ్యవసాయ పనులు చేసుకునేవారని, ప్రస్తుతం జూన్ ముగుస్తున్నప్పటికీ రైతుబంధు నిధులు జమ కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు, అంతేకాకుండా వృద్ధాప్య పెన్షన్ సైతం గత రెండు నెలలుగా అందక వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇకనైనా పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో పడకేసిన పారిశుధ్యం

- ఎక్కడపడితే అక్కడ చెత్త చెదారం పారబోత
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న రోగులు
- పట్టించుకోని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు





నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుద్ధ్యం పడకేసింది. ఆసుపత్రి ఆవరణలో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పాట వ్యర్థాలను పారవేశారు. వ్యర్థాలను పారవేయడంతో వ్యర్థ పదార్థాలు కుళ్లిపోయి దుర్గంధవాసన వెదజల్లుతుంది దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులు దుర్వాసనతో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని అంటున్నారు. ఒకవైపు ప్రభుత్వం సీజనల్ వ్యాధుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతుంటే నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మాత్రం డాక్టర్లు మాత్రం అదేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆరోగ్యం పట్ల ప్రజలకు వివరించాల్సిన డాక్టర్‌లే ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ ఉండడంతో చూసి చూడనట్లుగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత పై అధికారులు కలుగజేసుకొని ఆస్పత్రి ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని పలువురు రోగులు కోరుతున్నారు.

ఆలయానికి హుండీ బహుకరణ



నవతెలంగాణ-రాయపోల్

రాయపోల్ మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయానికి దాతలు హుండీ బహుకరణ చేయడం జరిగిందని రాయపోల్ మాజీ ఎంపీటీసీ అహ్మదిపూర్ రాజు గౌడ్ తెలిపారు. ఆదివారం రాయపోల్ మండల కేంద్రంలో రేణుక ఎల్లమ్మ ఆలయంలో హుండీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయపోల్ మండల కేంద్రంలో ఇటీవల నిర్వహించిన రేణుక ఎల్లమ్మ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా మొక్కుకున్న మొక్కులో భాగంగా రాయపోల్ మండల కేంద్రానికి చెందిన దుడుక రాజయ్య, దుడుక గణేష్ భక్తులు రేణుక ఎల్లమ్మ దేవాలయానికి హుండీని అందజేశారు. ఈ సందర్భంగా దుడుక రాజయ్య, దుడుక గణేష్‌లను గౌడ సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేసి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ గౌడ సంఘం సభ్యులు అహ్మదిపూర్ రాజు గౌడ్, మాదాస్ నవీన్ గౌడ్, మదాస్ పెంటా గౌడ్, మాదాస్ మురళి గౌడ్, మాదాస్ నర్సా గౌడ్, మాదాస్ బాల్ లింగం గౌడ్, అహ్మదిపూర్ వెంకట్ గౌడ్, అహ్మదిపూర్ శ్రీనివాస్ గౌడ్, మాదాస్ రాజు గౌడ్, మాదాస్ కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలి

- మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

సంస్కృతి సాంప్రదాయాలను కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న అన్నారు. ఆదివారం హుస్నాబాద్ పట్టణంలోని సంఘమిత్ర బీఈడీ కళాశాలలో హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి మహిళాల కోలాటం, డ్రామా కార్యక్రమాలు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వలస సుభాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న మాట్లాడుతూ కళలకు కానాచి మన హుస్నాబాద్ ప్రాంతం కావాలని పిలుపునిచ్చారు. కళ పట్ల కళాకారుల ప్రదర్శన ఎంత గొప్పగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ప్రోగ్రాం కోఆర్డినేటర్ యాదగిరి ,కోలాటం మాస్టర్ గీత, శారద, సభ్యులు రాగూర్ బాలాజీ సింగ్ పరశురాముల గౌడ్ కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



ఏకకాలంలో రైతు రుణమాఫీ హర్షనీయం

యూత్ కాంగ్రెస్ నాకుడు శ్రీకాంత్



నవతెలంగాణ-దుబ్బాక

అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ సర్కార్ ఏకకాలంలో రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం పట్ల యూత్ కాంగ్రెస్ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు బురాని శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం దుబ్బాకలో విలేకరులతో మాట్లాడారు. ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీతో తెలంగాణ రైతులకు కొండంత ధీమాను అందిస్తుందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే నైజం కాంగ్రెస్ సర్కార్ దేనన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడూ ప్రజల ఆదరణ ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

మొబైల్ అప్ ద్వారా టీజీఎస్పీడీసీఎల్ 11 కేవీ ఫీడర్ల సర్వే



నవతెలంగాణ-మెదక్ టౌన్

దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ(టిజిఎస్పీడిసిఎల్) సమగ్ర నెటవర్క్ సర్వే కొరకు మరో మొబైల్ అప్ టిజిఏఐఎంఎస్ రూపొందించింది. ట్రాన్స్‌ఫార్మర్లు, ఉన్న విద్యుత్ తీగలు పరికరాలు ఇలా ప్రతిదీ ఏ దశలో ఉంది, ఎలా పనిచేస్తుంది అనే వివరాలను ఈ ఆప్ ద్వారా రికార్డు చేయబోతున్నారు. టీజీఎస్పీడిసిఎల్, మెదక్ ఎస్ఈ జానకి రాములు తన బృందంతో మెదక్ పట్టణంలో ప్రయోగాత్మకంగా నమోదు ప్రక్రియ చేపట్టారు. సోమవారం నుంచి అధికారికంగా ప్రారంభిస్తున్నట్లు మెదక్ ఎస్ఈ తెలిపారు. మొదటి దశలో విద్యుత్ లైన్లు సర్వే పనులను మెదక్ టౌన్ పరిధిలో ఉన్న 10 ఫీడర్లును, మూడు బృందాలుగా ఏర్పడి మొబైల్ అప్ ద్వారా జిపి ఎస్‌తో అనుసంధానం చేస్తారని తెలిపారు. ఏ ఈ, సిబ్బంది ఒక బృందంగా, సబ్ ఇంజనీర్, సిబ్బంది మరో బృందంగా క్షేత్ర స్థాయిలో అన్ని అంశాలపై సర్వే చేయనున్నారన్నారు. ప్రస్తుతం విద్యుత్ నెటవర్క్ మ్యానువల్‌గా కొనసాగుతుంది ఎక్కడైనా సమస్య వస్తే సిబ్బంది వారికున్న పరిజ్ఞానం ఆధారంగా ఫలానా సమస్య అయిఉండవచ్చని భావించి అక్కడికి వెళ్లి మరమ్మతులు చేస్తారు. ఈ ఆప్ ద్వారా పూర్తి సమాచారం చేతిలో ఉంటే దాని బట్టి ప్రాధాన్యల వారీగా నిర్వహణ ప్రణాళికలు రూపొందించుకొనేందుకు సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు ఈ అప్ దోహదం చేస్తుందిని ఎస్ ఈ తెలిపారు.

సుడా కార్యాలయ అవినీతిపై విచారణ జరిపించాలి

- డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్ యాదవ్

నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట సుడా కార్యాలయంలో రాత్రి సమయంలో అక్రమంగా ఫైల్స్ తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, అవినీతిపై విచారణ జరిపించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరుతామని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే హరీష్ రావు సూడ ఏర్పాటు చేసుకోని కోట్ల రూపాయల ప్రజాదనన్ని దోచుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి పై విచారణ జరిపితే బయట పడకుండా ఉండుటకోసం రాత్రికి రాత్రే గుట్టు చప్పుడు కాకుండా ఫైల్స్ మాయం చేశారన్నారు. వెంటనే సంబంధిత అధికారులు విచరణ చేసి బాద్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికీ తీసుకెళ్లి సిద్దిపేట అవినీతిపై విచారణ చేపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మీసం మహేందర్, ఉపాధ్యక్షులు సందబోయిన పర్శరాం, సెక్రటరీ కోరిమి రాజు, యూత్ కాంగ్రెస్ మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తిని గణేష్, సీనియర్ నాయకులు మీసం రాజు తదితరులు పాల్గొన్నారు.



నీట మునిగి యువకుడు మృతి



నవతెలంగాణ-పాపన్నపేట

ప్రమాదవశాత్తూ నీట మునిగి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఏడుపాయల ఆలయ సమీపంలోని వనదుర్గా ప్రాజెక్టులో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఏఎస్ఐ సంగన్న కథనం ప్రకారం. హైద్రాబాద్ చింతల్‌కు చెందిన మహమ్మద్ ఫిరోజ్ (21) శనివారం సాయంత్రం స్నేహితులతో కలిసి సరదాగా ఏడుపాయలకు వచ్చాడు. రాత్రి అక్కడే ఉన్నారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఆలయ సమీపంలోని వనదుర్గా ప్రాజెక్టు వద్దకు వెళ్లారు. అందరూ కలిసి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గజఈతగాళ్ల సాయంతో మృతదేహన్ని వెలికి తీశారు. మృతదేహన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి యూనస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

ఏరులై పారుతున్న మురికి నీరు



నవతెలంగాణ-రాయపోల్

చినుకు పడితే రోడ్లంత చిత్తడే ఎరులై పారుతున్న మురికి వరద నీరు. రాయపోల్ మండలం అనాజీపూర్ దళితవాడ పరిస్థితి. గడిచిన ఐదు సంవత్సరాలలో ప్రజా ప్రతినిధులకు అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్న పట్టించుకున్న పాపాన పోలేదు. దానితో కాలనీలో ఉంటున్న ప్రజల పరిస్థితి చాలా దుర్భలంగా మారింది. దళిత వాడకు చెందిన ప్రజలు మురికి కాలువలు లేక తరచూ అనారోగ్యబారిన పడిన పట్టించుకున్న నాధుడే లేరు. కనీసం సంబంధిత అధికారులు అయిన పట్టించుకుంటారని వినతి పత్రాలు ఇచ్చిన, వివిధ దిన పత్రికలలో వార్తలు ప్రచురితమైన సోషల్ మీడియా ద్వారా తెలియజేసిన ఇప్పటి వరకు కనీసం దళిత వాడను సందర్శించకపోవడం విచారకరం. దళితులు అంటే చిన్న చూపా..?? దళితులు ఈ దేశ పౌరులు కాదా..?? అంటూ దళిత కాలనీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు వెంటనే దళిత కాలనీలను సందర్శించి సమస్యను పరిష్కరించాలని అనాజీపూర్ దళిత కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేశారు.

వితంతువులు పై వివక్షత విడనాడాలి

-తిమ్మాయిపల్లిలో అంతర్జాతీయ వితంతు దినోత్సవ సందర్భంగా అవగాహన ర్యాలీ



నవతెలంగాణ -నంగునూరు

వితంతువులుపై వివక్షత విడనాడాలని బాలవికాస ప్రతినిధులు తెలిపారు.నంగునూరు మండలం తిమ్మాయిపల్లి గ్రామంలో ఆదివారం ప్రపంచ వితంతువు దినోత్సవ సందర్భంగా గ్రామంలోని మహిళలతో వితంతువుల వివక్షతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.అనంతరం బాల వికాస మహిళా కోఆర్డినేటర్లు సుజాత,లక్ష్మిలు మాట్లాడుతూ..వితంతువును తోటి మహిళలతో సమానంగా చూడాలని పేర్కొన్నారు.మూఢనమ్మకాలు విడనాడాలని, తన భర్తను కోల్పోయి ఆర్థికంగా మానసికంగా ఇబ్బంది పడుతున్న తరుణంలో సమాజం నుంచి మూఢ నమ్మకాల ద్వారా వారిని వివక్షత గురిచేసి ఇబ్బందులు గురిచేయడం సరి కాదన్నారు. వారిని కూడా తోటి మహిళలతో సమానంగా అన్ని హక్కులు కల్పించాలని, సమానంగా చూడాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాజా, మాజీ సర్పంచ్ ఎలా లత, బాల వికాస ప్రతినిధులు, మహిళా సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు,పలువురు వితంతు మహిళలు, బాలవికాస మహిళా కోఆర్డినేటర్లు సుజాత, లక్ష్మి పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన మాజీ శాసనసభ్యులు తూంకుంట నర్సిరెడ్డి

నవతెలంగాణ-ములుగు : ములుగు మండలం సింగన్నగూడెం గ్రామంలో బాసమైన రవి,కాస శ్రీకాంత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా గజ్వేల్ మాజీ శాసనసభ్యులు తూముకుంట నర్సారెడ్డి వచ్చి ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో ఆశలి వాసుగౌడ్, సింగనగూడం మాజీ సర్పంచ్ మన్నే రవీందర్, యాదయ్య ,ఎల్లం తదితరులు పాల్గొన్నారు



మంత్రులను కలిసిన మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు



నవతెలంగాణ- ములుగు

ఎన్నో ఏళ్లుగా పార్టీ బలోపేతం కోసం పనిచేస్తున్న నల్ల రాణి శ్రీనివాస్ కు ములుగు మండల వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కేటాయించి న్యాయం చేయాలంటూ దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లను ములుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగిశెట్టి శ్రీనివాస్‌గుప్తా కలిసి కోరారు .శనివారం ఇరువురు మంత్రులను వారి వారి కార్యాలయాల్లో కలిసి ములుగు ,వర్గల్ ,మర్కుక్ మండలాల్లోని పలువురు కాంగ్రెస్ నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ అధ్యక్ష పదవిని నల్లరాణి శ్రీనివాస్‌లకు కేటాయించి ఏకగ్రీవ పత్రాన్ని మంత్రులకు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యున్నతికి దోహదం చేసిన వారికి న్యాయం చేయవలసిందిగా మంత్రులను కోరారు .అదేవిధంగా మండలంలోని పార్టీ నాయకులతో చర్చించి పార్టీకి పనిచేసిన వారిని గుర్తించి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని నిర్ణయించవలసిందిగా వారు కోరారు.వారి వెంట నాయకులు.మామిడాల శ్రీనివాస్, చేర్యాల లక్ష్మణ్, గొంగడి కృష్ణ,నర్సింహారెడ్డి, బుడిగే మహేష్, తోడేటి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా వైద్య సేవలతో ఎంతో మేలు



నవతెలంగాణ -నంగునూరు

గ్రామీణ ప్రాంతాల్లో ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని తాజా, మాజీ సర్పంచ్ పంగ కుమార్ చెప్పారు. ఆదివారం నంగునూరు మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో అంకుర పిల్లల హాస్పిటల్ సిద్దిపేట సౌజన్యంతో పిల్లలకు ఉచితంగా ఆరోగ్య శిబిరం నిర్వహించారు. చిన్న పిల్లలకు దగ్గు, జ్వరం తదితర సమస్యలను డాక్టర్ నిహార్ గోపాలపురం పరిక్షించారు.సుమారుగా 50 మంది పిల్లలకు ఉచితంగా మందులు అందజేశారు.వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులు హాజరైనారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి



నవతెలంగాణ -నంగునూరు

క్రీడా పాఠశాలలో ఎంపిక కావడానికి విద్యార్థులు వారి దరఖాస్తులను ఈనెల 24 వరకు నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జి.రాజమౌళికి అందించాలని ఇంచార్జి నంగునూరు మండల విద్యాశాఖాధికారి సత్తు యాదవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరంలో 3వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరంలో క్రీడా పాఠశాలలో 4వ తరగతి ప్రవేశాల కొరకు విద్యార్థుల ఎంపిక ఉంటుందన్నారు. విద్యార్థులు 2015 సెప్టెంబర్ 1 నుండి 2016 ఆగస్టు 31 మధ్యన జన్మించి ఉండాలని, ఆసక్తి గలవారు డేటాషీట్లో విద్యార్థి పాస్‌పోర్ట్ సైజ్‌ఫోటో అతికించి పూర్తి వివరాలతో దరఖాస్తు ఫారం నింపాలని, ఒరిజినల్ బోనఫైడ్, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం జిరాక్స్ కాపీలు జతచేసి ఈనెల 24 లోగా ఇవ్వాలని, ఈనెల 25న మండల స్థాయిలో, 27న సిద్దిపేట డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి సెలక్షన్లు నిర్వహిస్తారని, జిల్లా స్థాయి సెలక్షన్ వివరాలకు డివైఎస్ఓ నాగేందర్ ను 98482 76450 ఫోన్లో సంప్రదించాలని తెలిపారు.

శ్యాం ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం

-బీజేపీ మండల అధ్యక్షులు అన్నసారం సురేష్ గౌడ్

నవతెలంగాణ- సిద్దిపేటరూరల్



జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని సిద్దిపేట రూరల్ మండల బీజేపీ అధ్యక్షుడు అన్నసరం సురేష్ గౌడ్ అన్నారు. ఆదివారం సిద్దిపేట రూరల్ మండలంలోని బండచెర్లపల్లి గ్రామంలోభారతీయ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సమైక్యత సమగ్రత కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. దేశ సమున్నత సమైక్యత భారత్ కోసం పోరాటం చేసిన మహోన్నత నాయకుడు అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చ జిల్లా ప్రధనకార్యదర్శి రాజు, బూత్ అధ్యక్షులు స్వామి, సీనియర్ నాయకులు శ్రీకాంత్, జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని కాంగ్రెస్ నేత ఓదార్పు

-కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్



నారాయణరావు పేట కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బిట్ల శ్రీనివాస్ తండ్రి బిట్ల రాజయ్య శనివారం మంణించారు. విషయం తెలుసుకున్న కాం గ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇ న్చా ర్జి పూజల హరికృష్ణ కుటుంబ సభ్యుల ను ఓదార్చి పరామర్శించరు.ఆర్థిక సహాయం చేశారు. అధైర్య పడవద్దని పార్టీ అన్ని విధాలు ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బర్మా రామచంద్రం, రాష్ట్ర ఫిషర్ మెన్ సెక్రెటరీ గౌటి బాబేష్, మండల యూత్ అధ్యక్షులు బాగన్న కరుణాకర్ ,రాజేశం గౌడ్, బొందన్న వెంకట్, లక్ష్మణ్, బాలరాజ్, రమేష్, దేవయ్య, కనకయ్య, రమేష్, ఉప్పలయ్య, నవీన్, మధుసూదన్ రెడ్డి, ఎల్లయ్య, అంజిరెడ్డి, కనకయ్య, బాబు, రమేష్, ఉన్నారు.

గజ్వేల్ లో శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

నవతెలంగాణ- గజ్వేల్

బీజేపీ గజ్వేల్ పట్టణ కార్యాలయంలో ఆదివారం డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉప్పల మధు, బండారు మహేష్, అశోక్ గౌడ్, అరవింద్, సందీప్, నాగు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సన్న రకం వరి సాగుపై రైతు దృష్టి



- మార్కెట్లో ధర పలుకుతున్న సన్నారకం బియ్యం

నవతెలంగాణ- గజ్వేల్

సిద్దిపేట జిల్లాలో సన్న వడ్ల సాగు విస్తీర్ణం పై రైతులు దృష్టి పెట్టారు. గత ఏడాదిగా సన్న బియ్యానికి ధరలు పెరగడం పెరిగిన ధరలు నిలకడగా ఉండడంతో పాటు ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో సన్న వడ్ల సాగు వైపు రైతులు దృష్టి సారించారు. గత నెల రోజులుగా వానకాలం సీజన్ ప్రారంభం అయ్యింది. రోహిణి కార్తిలో సన్న రకాల వరి విత్తనాలను నార్లు పోస్తారు. ఇప్పటికే చాలామంది రైతులు నార్లు పోశారు. సిద్దిపేట జిల్లాలో ఐదు లక్షల 50 ఎకరాలలో అన్ని పంటలు సాగు చేస్తుండగా ఇందులో మూడు లక్షల ఎకరాల్లో వరి సాగు చేసేందుకు రైతులు పొలాలను సిద్ధం చేస్తున్నారు. రెండు లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. మరో 50 ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో భాగంగానే మూడు లక్షల వరి సాగు లో భాగంగా ఇందులో 25 శాతం సన్న రకాన్ని రైతులు పండించేందుకు సిద్ధం చేసుకుంటున్నారు.సన్న వరి విత్తనాల ధరలు పెరిగినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని దొడ్డు రకాల వరి విత్తనాలు బ్లాక్ మార్కెటింగ్ విక్రయాలు జరుగుతున్నాయి. ఇందులో 20 నుండి 25 శాతంలోపే సన్న రకాలు మిగతా విస్తీర్ణంలో దొడ్డు రకాల సాగు జరిగేది. జిల్లా వ్యాప్తంగా మూడు లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్న నేపథ్యంలో దీంతో సన్నా రకాలకు డిమాండ్ పెరగడంతో ఆ రకాల సాగు కోసం రైతులు ఉత్సాహం చూపుతున్నారు. వానాకాలం సీజన్ సన్నరకాల సాగుకు అనుకూలంగా ఉంటుంది. సన్న రకాలు పంట చేతికి రావడానికి ఎక్కువ రోజులు పడుతుంది. చీడపీడ తెగుళ్ల బెడద అధికంగా ఉంటుంది. దిగుబడి దొడ్డు రకాల కంటే తక్కువగా వస్తుంది. ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యం, ప్రభుత్వ హాస్టళ్లు , మెస్‌లకు దొడ్డు బియ్యం సరఫరా కావడం వల్ల దొడ్డువాటికి డిమాండ్ ఉండేది. ఇటీవల సన్న బియ్యం పంపిణీతో పాటు అన్ని వర్గాల ప్రజలు సన్న బియ్యం వినియోగించడం వల్ల సన్నారకాలకు డిమాండ్ బాగా పెరిగింది. గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక, చేర్యాల, వర్గల్, ములుగు, కొండపాక, జగదేవపూర్, మిరుదొడ్డి తదితర మండలాల్లో సన్న బియ్యం డిమాండ్ అధికం కావడంతో స్థానిక బహిరంగ మార్కెట్లో సన్న రకాలకు ధరలు పెరిగాయి. క్వింటాలు సన్న బియ్యం ధర రూ. 6,500 వరకు పలుకుతుంది. గత రబీ, వానకాలం సీజన్లలో క్వింటాలు సన్న వడ్లు రూ. 3000 వరకు పలికింది. దీంతో ఈ వానకాలం సీజన్ లో సన్నరకాల సాగుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు.మద్దతు ధరను మార్చాలి...కేంద్రం మద్దతు ధర వర్తింపజేయడంలోనే సాధారణ , ఏ గ్రేడ్ రకాలలో మార్పు తీసుకు రావలసిన అవసరం ఉంది. కేంద్రం సన్న వడ్ల కంటే దొడ్డువడ్లకు ధర అధికంగా వర్తింపజేస్తుంది. దొడ్డు రకాల కంటే సన్న రకాలకు డిమాండ్ బాగా పెరిగింది. . సన్న రకాల సాగు పెట్టుబడి ఖర్చులు అధికంగా వస్తాయి. దిగుబడి దొడ్డు రకాల కంటే తక్కువగా ఉంటుంది. దీంతో సన్న రకాల సాగు రైతుకు దొడ్డు రకాల కంటే తక్కువ ఆదాయం వస్తుంది. దీనిని గుర్తించి ప్రభుత్వం మద్దతు ధరను దొడ్డు రకాల కంటే ఎక్కువగా పెంచాలి. స్థానిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని సన్న రకాల సాగు ప్రోత్సాహం కోసం మద్దతు ధరని బాగా పెంచవలసిన అవసరం ఉంది.రేషన్ బియ్యం సన్న బియ్యం పంపిణీ చేయాలి.. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం కూడా సన్న రకాలనే పంపిణీ చేయడం అవసరం. దొడ్డు రకాల బియ్యం పంపిణీ చేసినప్పటికీ ఆ బియ్యాన్ని గ్రామాలలో సైతం ఎవరు తినడం లేదు. తిరిగి వ్యాపారులకు అమ్మగా రీసైక్లింగ్ అవుతూ తిరిగి రైస్ మిల్లులకు చేరుతున్నాయి. దీంతో మిల్లర్‌రు వాటిని మళ్లీ ప్యాకింగ్ చేసి పౌరసరఫరాల గిడ్డంగులకు పంపిణీ చేస్తున్నారు. ఎక్కువ సార్లు రీసైకిలింగ్ జరిగిన బియ్యం దురిసిపోయి తినడానికి పనికి రాకుండా పోతున్నాయి. ప్రభుత్వం ఈ విషయంలో తగిన పరిశీలనలు చేసి సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తే తెల్ల రేషన్ కార్డు వినియోగదారులందరూ తినడానికి వీలుంటుంది.బ్లాక్ మార్కెట్ విత్తన అమ్మకాలపై నిఘా పెంచాలి..వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో అనేక రకాల విత్తనాలు బ్లాక్ మార్కెట్లో అమ్మకాలు కొనసాగుతున్నాయి. కొన్ని రకాల పత్తి విత్తనాలు, వరి విత్తనాలను వ్యాపారులు రహస్యంగా విక్రయిస్తున్నారు. అధిక దిగుబడి వంగడాలు రూపొందించాలి..అధిక దిబడులను ఇచ్చే సన్నరకం వరి వంగడాలను రూపొందించవలసిన అవసరం ఉంది. ప్రస్తుతం మార్కెట్లో ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు అధిక దిగుబడులు ఇచ్చే దొడ్డురకాల వరి విత్తనాలకే ప్రాధాన్యత ఇచ్చారు. మార్కెట్లో దొడ్డురకాల హైబ్రిడ్ వరి విత్తనాలు అధికంగా అందుబాటులో ఉన్నాయి. సన్నరకాల హైబ్రిడ్ వరి విత్తనాలు అందుబాటులో లేవు. డిమాండ్ ఉన్నప్పటికీ సీడ్స్ దుకాణాల్లో సన్నారకం విత్తనాలు కల్పించడం లేదు కోరుతా ఏర్పడుతుంది. ఇతర ప్రాంతాల నుండి రైతులు తీసుకొచ్చుకుంటున్నారు.వీటిలో కూడా హైబ్రిడ్ రకాలను రూపొందిస్తే దిగుబడులు పెరిగి రైతుకు లాభదాయకంగా మారితే ఆ రకాల సాగుపై మొగ్గు చూపే అవకాశం ఉంది.

అనుకున్న సమయానికి రుణమాఫీ

- హరీష్‌రావు రాజీనామాకు సిద్ధం కావాలి
- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



నవతెలంగాణ గజ్వేల్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుకున్న సమయానికి ఆగస్టు 15 లోపు రెండు లక్షల రుణమాఫీని చేస్తామని ప్రకటించడంతో కార్యచరణ ప్రారంభించినట్లు సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాటల ముఖ్యమంత్రి కాదని చేతల ముఖ్యమంత్రిని ఆయన అన్నారు. 2018 డిసెంబర్ నుండి 2023 డిసెంబర్ 9, వరకు రైతులు తీసుకున్న 2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించినట్లు ఆయన గుర్తు చేశారు. రుణమాఫీ సాధ్యం కాదన్నా మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు రాజీనామాకు సిద్ధం కావాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రుణమాఫీ చేస్తే తాను రాజీనామా చేస్తానని అన్నట్లు హరీష్‌రావుకు గుర్తుందా అని ఆయన ప్రశ్నించారు. ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తున్న నేపథ్యంలో రాజీనామా పత్రం కూడా ఆగస్టు 15 నాడు హరీష్ రావు స్పీకర్కు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. పది సంవత్సరాలు తెలంగాణ ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేసిన ఘనత కేసిఆర్, హరీష్ రావు అని ఆయన వద్దారు. అంతేకాకుండా సర్వం కోల్పోయిన మల్లన్న సాగర్, కొండపోచమ్మ జలాశయంలో భూములు ఇండ్లు కోల్పోయిన నిర్వాసితుల కోసం ప్రభుత్వం ప్రత్యేక జీవో ద్వారా ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సోమవారం కలుస్తున్నట్లు ఆయన చెప్పారు. రుణమాఫీ వారికి వర్తించడం లేదని సర్వం కోల్పోయిన నిర్వాసితులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇందుకు సోమవారం నిర్వాసితులతో గజ్వేల్ నుండి బయలుదేరి సీఎం కలుస్తామని ఆయన అన్నారు. నిర్వాసితులకు పూర్తి అండదండ అందిస్తామని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీలో మనస్పర్ధలు సహజమని అందరూ తమ మిత్రులు లేనని తమలో విభేదాలు లేవని ఆయన అన్నారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం త్వరలోనే అధికార ప్రకటన వస్తుందని ఆయన అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, నాయకులు మామిడి కృష్ణ, వహీద్, సురేష్, సుభాష్, శ్రీనివాస్, మల్లేశం, యాదగిరి, సురేష్, బాబా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో అందరికి సముచిత స్థానం

- మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



నవతెలంగాణ- గజ్వేల్

పది సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పుడు కష్టకాలంలో ఉన్న పార్టీ సీనియర్లకు, కార్యకర్తలకు దశలవారీగా నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పిస్తామని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అన్నారు. నామినేటెడ్ పదవులు విషయంలో అసంతృప్తితో ఉన్న నాయకులను ఆదివారం ఆయన కలిసి పై విధంగా అన్నారు. కొత్తవారికి అవకాశాలు లేవని చేరినప్పుడే చెప్పినట్లు ఆయన అన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి నామినేటెడ్ పదవుల్లో చోటు ఉంటుందని ఎలాంటి మనస్పర్ధలు పెట్టుకోకుండా పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేస్తున్నా వారందరూ తమ దృష్టిలో ఉన్నారని ఆయన చెప్పారు. పార్టీ సీనియర్లను, జూనియర్లను కష్టపడ్డ వారిని దూరం చేసుకోలేమని ఆయన పేర్కొన్నారు. కాకపోతే ఒకేసారి అందరికీ పదవులు రావాలి వచ్చే ఐదు సంవత్సరాల్లో అందరికీ పదవులు కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడుతానని ఆయన పేర్కొన్నారు. పార్టీ పెద్దల సహకారం గజ్వేల్ నియోజకవర్గంపై ఉందని ఆయన తెలిపారు. మంత్రులు కొండ సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన తెలిపారు. వ్యవసాయ శాఖమంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు ఎంతో అనుభవన వ్యక్తిని రైతుల కోసం ఎంతో ఆలోచిస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యకర్తలు కూడా అదే స్థాయిలో చూసుకుంటామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. గజ్వేల్ నియోజకవర్గం పార్టీ సీనియర్లకు సమచిత స్థానం ఇస్తామని మంత్రి కొండ సురేఖ హామీ ఇచ్చినట్లు ఆయన అన్నారు.కాంగ్రెస్ పార్టీలో పదవులను అడుగుతున్న వారందరికీ శాయశక్తుల ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. పట్టణంలోని పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు, మైనార్టీ నాయకులు బాబాను నర్సారెడ్డి కలిసి పలు విషయాలు చర్చించారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు సర్దార్ ఖాన్, నాగరాజు గౌడ్, రాజు గౌడ్, శేఖర్ గుప్తా, శివారెడ్డి, సురేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆభయ హస్తం పథకాన్ని అమలు చేయాలి

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

అంబేడ్కర్ ఆభయ హస్తం పథకాన్ని వెంటనే అమలు చేసి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు.ఆదివారం దళితుల సమగ్ర అభివృద్ధి,రక్షణ లపై అసెంబ్లీలో చర్చించాలని గజ్వేల్ అంబేడ్కర్ విగ్రహం వద్ద డీబీఎఫ్ అధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేవెళ్ల ఎస్సీ,ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేస్తామని ఎన్నికల మ్యానిపెస్టోలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన దళిత బంధు పథకం స్థానంలో అంబేడ్కర్ ఆభయ హస్తం పథకాన్ని 12 లక్షలకు పెంచి అమలు చేస్తామన్నా హామీహామీగానే మిగిలిపోయిందన్నారు.అంబేడ్కర్ ఆభయ హస్తం పథకానికి మార్గదర్శకాలను రూపొందించి వెంటనే అమలు చేయాలని శంకర్ డిమాండ్ చేశారు.ఎస్సీ రిజర్వేషన్‌లను 18 శాతం పెంచుతామని మరిచారన్నారు.ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను విభజించి ఎస్సీ, ఎస్టీల ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేస్తామనె హామీని నిలబట్టుకోవాలన్నారు. ఎస్సీ,ఎస్టీల పైపెరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని శంకర్ కోరారు.ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, ఇందుప్రియాల్ స్వామి,రాజు, తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నవ తెలంగాణ - సిద్దిపేట

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఒక్కొక్క హామీని నెరవేరుస్తున్నారని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కన్వీనర్ నాయిని నరసింహారెడ్డి అన్నారు. తెలంగాణ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రూపాయల వరకు ఏకకాల రుణమాఫీ చేస్తామని ప్రకటించినందుకు సిద్దిపేట గాంధీ చౌక్ లో కిసాన్ కాంగ్రెస్ సెల్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని రకాల చర్యలు చేపడుతున్నారన్నారు. ఎన్నికలకు ముందు అన్న ప్రకారం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చి ఏ ఒక్క హామీని నెరవేర్చలేక పో యిందన్నా రు. కాంగ్రెస్ పార్టీ అధికా రంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో 4 గ్యారంటీలను అమలుపరచిందన్నారు. ఇకనైనా టిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీపై అవాకులు చవాకులు మాట్లాడడం మానుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహిపాల్ రెడ్డి, రాజేశం గౌడ్, సత్యనారాయణ, రాజిరెడ్డి, రాజు ,శేఖర్,కృష్టారెడ్డి పాల్గొన్నా రు .

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవ తెలంగాణ -హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న1992-93 పదవ తరగతి స్నేహితుడు రుద్రారం రమేష్ ఇటీవల మృతి చెందగా స్నేహితుని కుటుంబానికి తోటి మిత్రులు రూ 20 వేల రూపాయలను అందజేశారు. పదవ తరగతి మిత్రులకు ఎలాంటి ఆపద కలిగిన అందరం కలిసి అండగా నిలుస్తున్నామని స్నేహితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొద్దుల శంకర్, పున్న అశోక్, వరియేగుల అనంతస్వామి,, బొల్లంపల్లి రవిందర్, ఎగ్గోజు సుదర్శనాచారి పాల్గొన్నారు.

రుణమాఫీ చేస్తున్నాం.. హరీష్ రావు రాజీనామాకు సిద్ధంగా ఉండు

- కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-తొగుట

రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడానికి క్యాబినెట్ తీర్మానం చేయడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, క్యాబినెట్ మంత్రులకు తెలంగాణ రైతుల పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. గతంలో సైతం రైతులకు ఒకే దఫాలో లక్ష రుణమాఫీ చేసిన చరిత్ర ఒక కాంగ్రెస్ పార్టీకే ఉందని, పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగు వాయిదాల్లో రుణమాఫీ చేసినా పూర్తిగా రుణమాఫీ కాలేదని ఎద్దేవా చేశారు. లక్ష రుణ మాఫీ చేయడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి చేతకాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి అని, రైతులకు మేలుచేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని తెలిపారు. రూ. 31 వేల కోట్లతో ఏక కాలంలో రైతుల రుణాలు మాఫీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఒక్కొకటిగా అమలు చేస్తు, ఇప్పటికే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 10 లక్షల ఉచిత ఆరోగ్య సేవలు, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ వంటి హామీలను అమలు చేయడం గర్వకారణం అన్నారు. ప్రజలకు ఉపయోగపడే పథకాలు అమలు చేస్తుంటే ప్రతిపక్షాలు జీర్ణించుకోవడం లేదన్నారు. అనవసర మైన విమర్శలు మానుకొని రైతులకు మంచి చేయడానికి, ప్రభుత్వానికి సూచనలు చేస్తే బాగుంటుందని హితవు పలికారు. కమీషన్ల కోసం తెలంగాణ సంపదను దోచుకొన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఏడు లక్షల కోట్ల అప్పులు చేసి ఆర్థిక విధ్వంసం సృష్టించారని మండిపడ్డారు. వారు చేసిన పాపాలకు మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణా రాష్ట్రం అప్పుల కుప్పగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం పూర్తి స్థాయిలో పనిచేస్తున్నారని, త్వరలోనే మరిన్ని హామీలను సైతం నెరవేర్చి ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకొంటామని అన్నారు. ఈ సమావేశంలో దుబ్బాక నియోజకవర్గ కన్వీనర్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్), జిల్లా నాయకులు గాంధారి నరేందర్ రెడ్డి, చెగుంట మాజీ పిఏసిఎస్ చైర్మన్ వెంగళ్ రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాబేర్, విజయ్ పాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.



నాగరాజును పరామర్శించిన నాయకులు



నవ తెలంగాణ - సిద్దిపేట

నిమ్స్‌లో మెదడులో నరాల బలహీనత వ్యాధితో చేరి, ప్రభుత్వ సహాయంతో చికిత్స పొంది ఇంటికి తిరిగి వచ్చిన ఆటో డ్రైవర్ నాగరాజును పరామర్శించినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు, న్యాయవాది బైరి ప్రవీణ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో బోయిగల్లికి చెందిన ఆటోడ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్న నాగరాజు నరాల బలహీనతతో బాధపడుతున్నాడు అని తెలుసుకొని, ప్రభుత్వం ద్వారా సహాయం అందించడానికి స్థానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పూజాల హరికృష్ణ దృష్టికి తీసుకుపోగా, ఆయన జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, ఇన్చార్జి మంత్రి కొండా సురేఖ ద్వారా బాధితునికి నిమ్స్ లో జరిగే చికిత్సకు సంబంధించిన ఎల్ఓసి ద్వారా 10లక్షల విలువైన శాస్త్ర చికిత్స చేయించాడని, ఆరోగ్యంగా ఇంటికి వచ్చాడని తెలిపారు. నాగరాజు కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, నాయకులకు కృతజ్ఞత తెలిపారు.

అసిస్టెంట్ కూక్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ- జగదేవ్‌పూర్

జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో గల మోడల్ పాఠశాల బాలికల వసతి గృహంలో సహాయ వంట మనిషి పోస్టులు 2 ఖాళీగా ఉన్నాయని ఇంచార్జి ఉమామహేశ్వరి ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాల్సింది కోరారు. అందుకు జీతం రూ.6500 ఉంటుందని తెలిపారు.7 తగరతి ఉత్తీర్ణులు అయ్యిండాలన్నారు. వయస్సు 18 - 45 సంవత్సరాల మధ్య ఉండాలని అన్నారు. జగదేవ్‌పూర్ గ్రామానికి చెందిన వారు అర్హులని తెలిపారు. దరఖాస్తులు 24 - 29 జూన్ 2024 తేదీ లోపు బాలికల వసతి గృహంలో ఇవ్వాలని అన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
సోమవారం | 24 జూన్ 2024 | www.navatelangana.com

నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగించుకోవాలి



నవతెలంగాణ-సిద్దిపేట్ కలెక్టరేట్

జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జరిగే మెగా జాబ్ మేళాలో నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని ఉద్యోగాలు పొందాలని జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర రవాణా మరి బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో 60 కి పైగా వివిధ కంపెనీలు 5వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు హుస్నాబాద్ పట్టణంలోని సోమవారం రోజు తిరుమల గార్డెన్ అండ్ ఫంక్షన్ హాల్‌లో మెగా జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు కలిగిన వారు అర్హులని, కనీస విద్యార్హత ఏడవ తరగతి అని 7, 10, ఇంటర్మీడియట్, డిప్లమా ఏ కేటగిరిలోనైనా, బిఏ, బీకాం, బీఎస్సీ, బీఫార్మసీ, ఎం ఫార్మసీ, బీఇ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంసీఎస్, హెూటల్ మేనేజ్మెంట్ మరియు పోస్ట్ గ్రాడ్యుయేషన్స్‌లలో ఉత్తీర్ణులై 35 సంవత్సరాలలోపు వారు ఎవరైనా 24వ తేదీ ఉదయం 10 గంటలకు హుస్నాబాద్ లోని తిరుమల గార్డెన్స్ అండ్ ఫంక్షన్ హాల్‌లో హాజరై జాబ్ మేళాలోపాల్గొనాలన్నారు.9642333667 మరియు 6300610339 హెల్ప్ లైన్ నెంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలను పొందాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు

స్పోర్ట్స్ పాఠశాలల్లో ప్రవేశలకు దరఖాస్తుల ఆహ్వానం

నవ తెలంగాణ - కొండపాక

స్పోర్ట్స్ అథారిటీ అఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ పాఠశాలల్లో నాలుగో తరగతి ప్రవేశం కోసం ఉమ్మడి కొండపాక మండల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఉమ్మడి కొండపాక మండల విద్యాశాఖ అధికారి పి.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రస్తుత విద్యాసం వత్సరానికి స్పోర్ట్స్ స్కూల్లో 4వ తరగతి చేరడానికి ఎంపికలు జరుగుతాయన్నారు.దరఖాస్తు చేసుకునే విద్యార్థి 2023-24 విద్యాసంవత్సరం మూడవ తరగతి చదివి ఉండాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 24 లోపు కొండపాక ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్ రెడ్డికి అందజేయాలని తెలిపారు. 25న మండల స్థాయి సెలక్షన్స్ 27న జిల్లా స్థాయి సెలక్షన్స్ ఉంటాయని తెలిపారు.

ఘనంగా బొడ్రాయికి జలాభిషేకం



నవతెలంగాణ- మర్కుక్

మండల పరి ధిలోని చేబర్తి గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆదివారం గ్రామ ంలోని బొడ్రా యికి ప్రత్యేక పూజలు నిర్వహించి జాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి గడప నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి బైండ్ల పంబాల ఆటపాటల మధ్య బొడ్రాయికి పూజలు నిర్వహించి జాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో వంటిమామిడి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాందాస్ గౌడ్, గ్రామ సర్పంచ్ అశోక్, ఉప సర్పంచ్ స్వామి,మాజీ రైతుబంధు సమితి కోఆర్డినేటర్ జాలని బాలనర్సయ్య,కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు యాదగిరి, గ్రామ పెద్దలు బాల్ నర్సయ్య, రాములు గౌడ్,మల్లేశం,గ్రామస్థులు తదితరులున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో సర్టిఫికెట్ ల పరిశీలన




నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మం డలం రాజగోపాల్ పేట పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజినీరింగ్ ప్రవేశం కోసం ఆదివారం సర్టిఫికేట్ల ప్రక్రియ కొనసాగుతుందని రాజ గోపాల్‌పేట ప్రిన్సి పాల్,కోఆర్డినేటర్ జి.సూర్యనారాయణ తెలిపారు.రెండవ రోజు 271 మంది హాజరయ్యారు.ఈ నెల 25వరకు సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోందన్నారు.కౌన్సెలింగ్ హాజరయ్యే విద్యార్థులు కళాశాలలో చేరేందుకు ముందుగా ఆప్షన్లు పెట్టుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో నితిన్ పవార్, శ్రీనివాస్, రాజు, సంధ్యా రాణి, రాజమౌళి, శ్రీనివాస్ కవిత, జ్యోతి, స్వామి,బాలమణి తదితరులు పరిశీలించారు.

సిద్దిపేట నాయకుల పెత్తనంలో దుబ్బాక వెనుకబాటు

మంత్రిని విమర్శించే నైతిక హక్కు ఎమ్మెల్యేకు లేదు- మచ్చ శ్రీనివాస్




నవ తెలంగాణ- దుబ్బాక

సిద్దిపేట నాయకుల పెత్తనంలో దుబ్బాక వెనుకబడి పోయిందని..పదేళ్లుగా ఇక్కడి నిధుల్ని సిద్దిపేటకు దర్జాగా తరలించుకుపోతుంటే నోరు మెదపని దుబ్బాక ఎమ్మెల్యేకు రాష్ట్ర మంత్రిని ప్రోటోకాల్ పేరుతో విమర్శించడం సరికాదని కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్ విమర్శించారు.జిల్లా ఇన్చార్జి మంత్రి కొండా సురేఖను విమర్శించే నైతిక హక్కు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి లేదన్నారు.ఆదివారం దుబ్బాకలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గెలిచి 8 నెలలు కావస్తున్నా ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి దుబ్బాకకు తెచ్చిన నిధులు,చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని నిలదీశారు.దుబ్బాక ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆఫీసుల్లో పనిచేస్తున్న సిద్దిపేటకు చెందిన కాంట్రాక్ట్,అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్ని తొలగించి..వారి స్థానంలో దుబ్బాక ప్రాంత నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

సిద్దిపేట విద్యార్థినికి బంగారు పథకం


నవ తెలంగాణ - సిద్దిపేట



రాష్ట్ర వ్యాప్తంగా ఉర్దూ మీడియంలో ప్రతిభ కనబర్చినా విద్యార్థినులకు మదినా ఎడ్యుకేషన్ సెంటర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నాంపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో బంగారు పథకాలను అందజేశారు. 2023-2024 సంవత్సరానికి సిద్దిపేట నాసర్ పుర ఉర్దూ మీడియం పాఠశాలలో 10వ తరగతిలో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆయిషా సిద్దిఖకు గోల్డ్ మెడల్ తో పాటు, ప్రశంస పత్రం అందజేయాగా, పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు అఫ్జల్ షరీఫ్ హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన పెద్దమ్మ ఉత్సవాలు

నవతెలంగాణ - నంగునూరు



మండల కేంద్రమైన నంగు నూరు పెద్దమ్మ ఆరవ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిసాయి. శనివారం ముదిరాజ్, మత్స్య సహకార సంఘాల ఆధ్వర్యంలో పోచమ్మ తల్లులకు సదరు బోనాలు సమర్పించారు. ఆదివారం పెద్దమ్మ తల్లికి సదరు బోనాలు సమర్పించారు.ఓడి బియ్యాలు పోశారు.ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అక్కడే ముదిరాజ్, మత్స్య సహకార సంఘాల ఆధ్వర్యంలో వంటలు చేసి సహపంక్తి భోజనాలు చేశారు.పాడి పంటలు బాగా పండాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని పెద్దమ్మ తల్లిని వేడుకున్నారు.ముదిరాజ్, మత్స్యసహకార సంఘాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు,కుల పెద్దలు, సంఘం సభ్యులు, మహిళలు తదితరులు హాజరైనారు

ప్రైవేట్ పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్ ఉందా....?

- రోడ్లపై దర్శనమిస్తున్న డొక్కు బస్సులు





నవతెలంగాణ- గజ్వేల్

పాఠశాల ప్రారంభం ఎంత ముఖ్యమో పాఠశాల బస్సుల భద్రత కూడా అంతే ముఖ్యం, బడికి వెళ్లే పిల్లలను బడులకు తరలించే బస్సులు ఫిట్టుగా ఉంటేనే, సురక్షితంగా పాఠశాలకు వెళ్ళొస్తారు. లేకపోతే పిల్లల ప్రాణాలు గాలిలో దీపాలుగా మాదిరిగా మారిపోతాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్న ప్రైవేట్ పాఠశాల బస్సులు ఎంత మేర భద్రత ఉన్నాయని ప్రశ్నార్థంగా మారింది. ప్రతి ఏటా ఆర్టీఏ అధికారులు స్కూల్ ప్రారంభ దశలోనే ప్రైవేట్ పాఠశాల బస్సుల ఫిట్‌నెస్ తనిఖీ చేసి బస్సు ఫిట్నెస్ పై పాఠశాల యజమాన్యానికి పలు సూచన,సలహాలతో పాటు నోటీసులు జారీ చేసేవారు. జూన్ 12న ప్రారంభమై దాదాపు పక్షం రోజుల కావస్తున్న ప్రైవేట్ పాఠశాల బస్సులపై ఫిట్‌నెస్ తనిఖీలు ఇప్పటివరకు జరగలేదు. గతంలో జరిగిన ప్రమాదాలు నిదర్శమని అనేక పాఠశాలలో బస్సుల ఫిట్నెస్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించిన, పెద్దగా ఫలితం ఉండటం లేదు. పాఠశాల ప్రారంభ నేపథ్యంలోని రవాణా శాఖ అధికారుల సామర్థ్య పరీక్షలు ఎలా ఉన్నాయి? ఫిట్నెస్ లేని బస్సులపై అధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలి. జిల్లాలో నర్సరీ మొదలుకొని పదో తరగతి వరకు తెలుగు,ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు 200 వరకు ఉంటాయని పాఠశాల యజమాన్యాలు చెపుతున్నాయి. అదేవి ధంగా జూనియర్ కళాశాలలు 40 వరకు, డిగ్రీ కళాశాలలో 40 వరకు ఉంటాయి. ప్రభుత్వం నిబంధనల మూలంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో డిగ్రీ కళాశాలలో 20 వరకే కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రియెంబర్స్ చెల్లించకపోవడంతో చాలా డిగ్రీ కళాశాలలో మూతపడ్డాయి.డొక్కు బస్సులు కూడా ఉమ్మడి మెదక్ జిల్లాలో చాలా పాఠశాలలో ఉన్నట్లు సమాచారం. వాటిపై సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఒక్కొక్క వాహనం జీవితకాలం 15 సంవత్సరాలు ఆ తర్వాత తుక్కుగా మార్చాలి. కానీ జిల్లాలో పాఠశాల యజమానులు కాలం చెల్లిన డొక్కు బస్సులతో నడిపిస్తున్నారు. అటువంటి వారికి సంబంధిత శాఖ అధికారులు కూడా చూసి చూడనట్లు పోతున్నట్లు చెప్పారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో నర్సరీ మొదలుకొని పదో తరగతి వరకు 200 పాఠశాలలు ఉండగా ఒక్కొక్క పాఠశాలకు ఐదు నుండి 20 బస్సుల వరకు ఉంటున్నాయి. కొన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రైవేట్ బస్సులు ఏర్పాటు చేశారు. పట్టణ కేంద్రాల్లో నివసించే విద్యార్థులకు కళాశాల బస్సును అక్కడనే ఉండే విధంగా చూస్తుంది. ఉదయం కళాశాలకు తీసుకొచ్చి సాయంత్రం వారి నివసించ పట్టణాల్లో విద్యార్థులను దించుతున్నారు. అంతేకాకుండా గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక, చేర్యాల, హుస్నాబాద్ పట్టణాల నుంచి హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు నిత్యం విద్యాభ్యాసం కోసం వెళుతున్న విద్యార్థులకు ప్రైవేట్ యజమాన్యాలు బస్సులు ఏర్పాటు చేశాయి. అందులో కూడా సీట్లకు తగ్గట్టు కాకుండా ఎక్కువమందిని తీసుకపోతున్నట్లు సమాచారం.ప్రైవేటు స్కూల్ బస్సుల్లో ఒక్కొక్క బస్సులో సీట్లకు సరిపోను విద్యార్థులను కాకుండా ఎక్కువ సంఖ్యలో ఒకే రూటులో విద్యార్థులను నింపి పంపిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రుల నుండి విమర్శలు వస్తున్నాయి. దీనివల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఇంటికి వెళ్లిన తర్వాత తల్లిదండ్రులకు విషయాన్ని చెప్పుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో పరిధిలోనే పటాన్చెరువు, రామచంద్రపురం, సంగారెడ్డి ప్రాంతంలో శ్రీ చైతన్య, నారాయణ కళాశాలలో కూడా ఉండడంతో ఎక్కువ బస్సులు ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రైవేట్ యజమాన్యం ఏర్పాటు చేసి కళాశాల నిర్వహిస్తున్నారు. కాలం చెల్లిన బస్సులతో ప్రైవేట్ యజమాన్యాలు విద్యార్థులను పంపిస్తున్న సంబంధిత శాఖ అధికారులు ఆ బస్సులను తనిఖీ చేసిన ధృవీకరణ పత్రాలు ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. వాటిని రోడ్లపై తిరగకుండా ఆపేందుకు నిరంతర చర్యలు తీసుకోవడంలో క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, చేర్యాల , హుస్నాబాద్ పాత తాలూకా పరిధిలో ప్రైవేట్ పాఠశాలలు ఉన్నప్పటికీ కొన్ని పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నప్పటికీ మరికొన్ని పాటించడం లేదని చెప్పాలి. అదేవిధంగా సామర్థ్య పరీక్షల కోసం పాఠశాల యజమాన్యం తమ బస్సుల్ని రవాణా శాఖ కార్యాలయాలు పంపిస్తున్నాయి. వచ్చిన బస్సులకు రవాణా శాఖ అధికారులు నామమాత్రంగానే ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. కనిపించని ప్రథమ చికిత్స కిట్లు.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ బస్సులలో ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండాలి. ప్రైవేట్ పాఠశాలలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల బస్సుల్లో భూతద్దం పెట్టి ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండాలి కానీ ఎక్కడ కనిపించడం లేదు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 90శాతం బస్సులోను ఇదే దుస్థితి ఉందని చెప్పాలి. కొత్తగా కొనుగోలు చేసిన వాటిలో మాత్రమే ప్రథమ చికిత్స కిట్లు ఉంటున్నాయని రవాణా శాఖ అధికారులు చెప్పుకొస్తున్నారు.

నేటి తరానికి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆదర్శప్రాయుడు

- బాలేష్ గౌడ్



నవ తెలంగాణ- దుబ్బాక

దేశ సమైక్యత కోసం తన ప్రాణాలర్పించిన గొప్ప సంఘసంస్కర్త శ్యామ ప్రసాద్ ముఖర్జీ అని..నేటి తరానికి ఆయన ఆదర్శప్రాయుడని బీజేపీ రాష్ట్ర వర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్ పేర్కొన్నారు.దేశ ప్రజలందరికీ ఒకే పౌరస్మృతి ఉండాలని ఉద్యమించిన ముఖర్జీ ఆశయాలను ప్రధాని మోదీ అమలు చేయడం జరిగిందన్నారు.ఆదివారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని మెదక్ ఎంపీ రఘునందన్ రావు కార్యాలయంలో భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.బీజేపీ దుబ్బాక మండలాధ్యక్షుడు అంబటి శివప్రసాద్ గౌడ్,సీనియర్ నాయకులు గాజుల భాస్కర్,సుంకోజు ప్రవీణ్‌కుమార్,మల్లుగారి రమణా రెడ్డి,తొగుట రవీందర్,బెజ్జంకి సప్తగిరి,పల్లె నిహాల్ గౌడ్,పుల్లూరి రాజు,ఇస్తారిగల్ల యాదగిరి,మోత్కుపల్లి బద్రి,కారంకంటి రాజు,పాతూరి రాజు పలువురున్నారు.

తెలుగు కవితా వైభవం దశాబ్ది ఉత్సవాల్లో సిద్దిపేట కవులు

నవ తెలంగాణ - సిద్దిపేట



తెలుగు కవితా వైభవం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రవీంద్ర భారతిలో జరిగిన ఒక కార్యక్రమంలో తెలుగు భాషకు విశిష్ట సేవలు చేసిన వారికి తెలుగు బంధు అనే బిరుదును ప్రధానం చేశారు. సిద్దిపేట జిల్లాకు చెందిన కవులు పెందోట వెంకటేశ్వర్లు, ఎడ్ల లక్ష్మీకి పూర్వ ఉపకులపతులు కొలుకులూరు ఇనాక్, మేక రవీందర్, డాక్టర్ పి గౌరీ శంకర్ లు బిరుదులు ప్రధానం చేశారు.

శ్యాం ప్రసాద్ ముఖర్జీకి బీజేపీ నివాళులు

నవతెలంగాణ-బెజ్జంకి



మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం చౌరస్తా వద్ద శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి దినోత్సవాన్ని బీజేపీ నాయకులు ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి,మండలాధ్యక్షుడు రాజు,అనీల్, మల్లేశం,రాములు ,యువమోర్చా మండలాధ్యక్షుడు తూముల రమేష్,రామచంద్రం, శంకర్ హాజరయ్యారు.

హరీశ్ రావు రాజీనామా లెటర్ సిద్ధం చేసుకో

- కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరి కృష్ణ



నవ తెలంగాణ - సిద్దిపేట

రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, రాజకీయల నుండి శాశ్వతంగా తప్పుకుంటానని చెప్పిన హరీశ్ రావు మాట నిలబెట్టుకోవాలని, రాజీనామా చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరి కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15లోగా రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో,మంత్రులతో చర్చలు జరిపి నిర్ణయం తీసుకున్నారని అన్నారు. వరికి 500 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించిందని, వ్యవసాయాన్ని పండుగ చేయాలనీ, రైతును రాజును చేయాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. హరీశ్ రావు తన మాట నిలబెట్టుకుని తన పదవికి రాజీనామా చేయాలని కోరారు.

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్

నవ తెలంగాణ- సిద్దిపేట అర్బన్:

సిద్దిపేట పట్టణంతోపాటు సిరిసిల్లలో పలు దొంగతనాలు కేసులలో నిందితుడైన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సిరిసిల్ల పట్టణం సుందరయ్య నగర్‌కు చెందిన బురాని సుంబాసింగ్ సిద్దిపేట పట్టణంలోని పటేల్ పుర, నెహ్రూ పార్కు కాలనీలలో రెండు సెటర్లు తెరిచి దొంగతనం చేశాడని వచ్చిన ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసి పరిశోధన చేస్తున్న సమయంలో పట్టణంలోని ఎల్లమ్మ గుడి చౌరస్తా వద్ద ఉన్నాడన్న సమాచారంతో అతని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామని, కాగా అతనిపై సిరిసిల్లలో కూడా పలు దొంగతనం కేసులు ఉన్నట్లుగా తెలిసిందని సీఐ తెలిపారు

సమాజంలో వితంతువులను గౌరవించాలి

నవతెలంగాణ-బెజ్జంకి



సమాజంలో వితంతువులను గౌరవించాలని బాలవికాస స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధి అన్నామేరీ సూచించారు.ఆది వారం మండల పరిధిలోని పెరుకబండ గ్రామంలో అంతర్జాతీ య వితంతు దినోత్సవం సందర్భంగా బాలవికాస ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి వితంతు జీవన విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు.బాలవికాస కో ఆర్డినేటర్ సుజాత,మాజీ సర్పంచ్ కర్రావుల సరోజన,గ్రామ మహిళలు పాల్గొన్నారు.

చీలాపూర్‌లో పోచమ్మతల్లి బోనాలు

నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని చీలాపూర్ గ్రామ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు.

పాడిపంటలు,సుఖసంతోషాలతో ప్రజలు ఉండాలని, ఆర్థికాభివృద్ధి సాధించి జీవనం సాగించాలని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో, బోనాలతో మొక్కులు చెల్లించినట్టు మహిళలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రెడ్డి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రేమించిన వ్యక్తి కాదన్నాడని విద్యార్థిని ఆత్మహత్య

నవతెలంగాణ-వర్గల్

ప్రేమించిన వ్యక్తి కదన్నాడని ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని దండుపల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం దండుపల్లి గ్రామానికి చెందిన హరిత (17) గజ్వేల్ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. బంగ్లావెంకటపూర్ గ్రామానికి చెందిన స్వామి, హరిత కొద్దిరోజులుగా ప్రేమించుకుంటున్నారు. హరిత శనివారం రోజున కళాశాలకు వెళ్లి తిరిగి వచ్చి తన తల్లితో స్వామిని ప్రేమిస్తున్నని, పెళ్ళి చేసుకుంటానని, తాను కాదంటే చనిపోతానని చెప్పింది. స్వామిని వివాహం చేసుకోమని అడగగా అతను తిరస్కరించాడు. ఆదివారం రోజున హరిత కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు ఉదయం వెళ్లగా వారు ఉదయం 11 గంటలకు ఇంటికి తిరిగి వచ్చేసరికి సీలింగ్ ఫ్యాన్‌కి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. స్వామి పెళ్ళికి నిరాకరించడంతోనే తన కూతురు మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బేగంపేట్ ఎస్సై భువనేశ్వర్ రావు తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో ముఖర్జీ వర్ధంతి

నవతెలంగాణ -నంగునూరు

డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఆదివారం నంగునూరు మండల కేంద్రంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘనంగా నివాళులు అర్పించారు.ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి పప్పు సురేందర్ రెడ్డి,మండల ఉపాధ్యక్షుడు సతీష్ గౌడ్ , కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు జి. రాజినీకర్ రెడ్డి,నరేష్,మధు,శ్రీను,సీనియర్ నాయకులు వి.రజినీకర్ రెడ్డి, అమిరిశెట్టి ప్రవీణ్ కుమార్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి రెడ్డి, నాయకులు వస్తాదుల యాదగిరి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ పరిపరిపాలనలో వ్యవసాయం పండుగ

ములుగు గ్రామ బీఆర్ఎస్ పార్టీ తాజా మాజీ వార్డ్ మెంబర్ తోడేటి నరేందర్



నవతెలంగాణ -ములుగు

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలనలో వ్యవసాయం పండుగలా జరిగింది .24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించారు. కాంగ్రెస్ పరిపాలన ఆరు నెలల్లోనే ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు .కెసిఆర్ పరిపాలనలో తెలంగాణలో రెప్పపాటు విద్యుత్ పోలేదు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కరెంటు కోతలు పాత రోజులు గుర్తుకు తెస్తున్నాయి మాయ మాటలతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలి. రైతులకు ఎల్లవేళలా కరెంటు ఇచ్చి ఆదుకోవాలి

అహ్మదిపూర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ మండలం అమ్మదిపూర్ లో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమన్నీ ఆదివారం 2003 .04 బ్యాచ్ జిల్లా పరిషత్ పాఠశాల అహ్మదిపూర్ కి చెందిన అందరు కలుసుకున్నారు.. పాఠశాలతో ఉన్న అనుబంధం గుర్తు చేసుకోవడం జరిగింది. సరస్వతి విగ్రహ ఆవిష్కరణ ఉపాధ్యాయులతో కలిసి చేయడం జరిగింది..మరువలేని అనుబంధం.వారి అభిమానం వెలకట్టలేనిదని అన్నారు.అభివృద్ధి పథంలో ఉన్న మా పూర్వ విద్యార్థులను చూసి, వారితో ఉన్న అనుబంధాలను నెమరు వేసుకోవడం జరిగింది.గడచిన రోజుల గురించి చాలా మాట్లాడుకున్నారు. ఆత్మీయ ఉపాధ్యాయ బృందం దాదాపుగా హాజరవ్వడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన పూర్వ విద్యార్థులందరికి హృదయ పూర్వక ధన్యవాదముల తెలుపుతూ అందరూ సంతోషాన్ని వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్ రెడ్డి, విగ్నేశ్వర్ రెడ్డి, లక్ష్మరెడ్డి, లచ్చిరెడ్డి, పరమేష్, నరేష్ పూర్వ విద్యార్థులు రమేష్ గౌడ్, ప్రభాకర, అహ్మద్, సంతోష్ రెడ్డి, నర్సింలు, రాజ్ కుమార్ ,పింకీ, అనుపమ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

